# విశాల భారతి

17-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 163




## రేవంత్, హరీష్ రావులపై బీజేపీ కన్ను?

- గెలుపే లక్ష్యంగా ఇతర పార్టీల అగ్రనేతలపై బీజేపీ కన్నేసింది
- సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులను లాగేందుకు ఢిల్లీ పెద్దల ప్లాన్
- అగ్రెసివ్ హిందుత్వతో రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్‌ను పెంచిన మాస్ లీడర్
- సంజయ్ హయాంలోనే దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీలలో భారీ విజయాలు
- ఎన్నికల ముందు సంజయ్‌ను మార్చడం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న సరికొత్త వ్యూహాలు ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నాయి. ఒకప్పుడు ప్రత్యేక సిద్ధాంతాలు, నైతిక విలువలకే పెద్దపీట వేస్తూ సాగిన ఈ కాషాయ దళ ప్రయాణం ఇప్పుడు పూర్తిగా గెలుపే లక్ష్యంగా రూపుమార్చుకుంది. అధికారం దక్కించుకోవడమే పరమావధిగా ఢిల్లీ అగ్రనాయకత్వం సరికొత్త రాజకీయ స్క్రిప్ట్‌లను సిద్ధం చేస్తోంది. గతంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ నుండి వచ్చిన వలస

మిగతా 3లో..

## వ్యవసాయరంగానికి డిజిటల్ హంగులు



విత్తనం నుండి కొనుగోలు వరకు ప్రతి దశనూ డిజిటలైజ్ చేయాలి

వ్యవసాయ శాఖ పనితీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

వేదికలనే పూర్తిస్థాయి సేవా కేంద్రాలుగా మార్చాలి

పంట దిగుబడి పెంచేందుకు ఏఐ ప్రాజెక్టును విస్తరించాలి

కొరత లేకుండా చూస్తూ, యాప్ ద్వారా పారదర్శకత పెంచాలి

ఎరువుల కోటా, హక్కుల కోసం ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి పెంచాలి

02

## ఇంటి నిండా నోట్ల కట్టలే!

### సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇళ్ల పై ఏసీబీ దాడులు

పడుకునే మంచం కిందే కోట్లాది రూపాయల నోట్ల కట్టలు గుర్తింపు

రూ.12 కోట్ల నగదు, 8 కేజీల బంగారం, 20 కేజీల వెండి సీజ్

హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో 50 ఎకరాల భూ పత్రాలు లభ్యం

10 మంది బినామీలు, ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడుల గుట్టు రట్టు

రికార్డులు తారుమారు చేసి, 500శాతం అదనపు ఆస్తుల సంపాదన

03



## సింగరేణిని రక్షిస్తాం

- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉద్యమం
- కొత్త బొగ్గు గనులను నేరుగా సింగరేణికే కేటాయించాలి
- అండర్ గ్రౌండ్ గనులు తగ్గించి, ఓపెన్ కాస్ట్‌లు పెంచడం తప్పు
- గనుల్లో కనీస తాగునీరు, ఆక్సిజన్, భద్రత కరువయ్యాయి
- శ్రీరాంపూర్ ఆర్కే-7 గని వద్ద కవితను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- గనుల ఆధునికీకరణ, భద్రత కోసం తక్షణమే నిధులు ఇవ్వాలి



03




## వరి వద్దు?

ఎల్ నినో కరవు కాలంలో వరి కంటే ఆరుతడి పంటలే మేలు

తక్కువ నీటితో, 90 రోజుల్లోనే చేతికొచ్చే కంది, పెసర సాగు

తక్కువ తడితో వేరుశనగ, సోయాబీన్ పంటల ద్వారా మంచి లాభాలు

నీటి ఎద్దడిని తట్టుకునే జొన్నలు, రాగులకు మార్కెట్లో భారీ డిమాండ్

ఒక కిలో వరికి 1408 లీటర్లు, మొక్కజొన్నకు 710 లీటర్లే చాలు

నీటి లభ్యతను బట్టి స్మార్ట్ ప్లానింగ్ చేస్తే వ్యవసాయం లాభసాటి

**ఎల్‌నినో కాలంలో విపరీతమైన వాతావరణ మార్పుల వల్ల వర్షా లు సకాలంలో పడక వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఇలాంటి తరుణంలో సాంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తి పలికి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగడం అత్యంత ఆవశ్యకం. నీటి లభ్యత నానాటికి క్షీణిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలను పొదుపుగా వాడుకుంటూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే వ్యూహాలను రైతాంగం అలవర్చుకోవాలి.**

**ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. కేవలం సాంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ద్వారా ఆర్థిక నష్టాల నుండి సులభంగా గట్టెక్కవచ్చు. ఇటువంటి సంక్షోభ సమయాల్లో ముందస్తు ప్రణాళికలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడం చాలా అవసరం.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖరీఫ్ సీజన్ అనగానే సాధారణంగా అందరికీ వరి సాగు మాత్రమే గుర్తుకు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు ఈ పంట లాభదాయకంగానే ఉన్నప్పటికీ కరవు పరిస్థితులలో తీవ్ర నష్టాలను మిగులుస్తుంది. ఇటువంటి క్లిష్ట సమయాల్లో ఆరుతడి పంటల సాగు ఎంతో ఆశాజనకంగా కనిపిస్తుంది. నేల రకాన్ని బట్టి ఏ పంటలు వేయాలో సరైన అవగాహన పెంచుకుంటే తక్కువ నీటితోనే అద్భుతమైన దిగుబడులను సాధించడం సాధ్యమవుతుంది. భూమి సారాన్ని కాపాడుకుంటూనే ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవడం ఈ తరుణంలో చాలా ముఖ్యం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడే పంటలను ఎంచుకోవడం వల్ల పెట్టుబడి వృధా కాకుండా కాపాడుకోవచ్చు. మెట్ట ప్రాంతాలలో ఉండే ఎర్ర నేలలు, తేమ శాతం తక్కువగా ఉండే భూములు కందుల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఈ రకమైన నేలలు నీటిని ఎక్కువగా పట్టి ఉంచవు కాబట్టి కంది పంట వేర్లకు కుళ్లు తెగులు సోకే ప్రమాదం తప్పుతుంది. తక్కువ తడితోనే అద్భుతంగా పెరిగే గుణం ఉన్న కందులు ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా తట్టుకోగలవు. తక్కువ నీటి వినియోగంతో నాణ్యమైన దిగుబడిని ఇచ్చే ఈ పంట ప్రస్తుత కాలంలో రైతులకు ఒక వరప్రసాదంగా మారుతోంది. తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల రైతులకు ఈ రకమైన పప్పుధాన్యాల సాగు ఎంతో భరోసాను ఇస్తుంది. ప్రస్తుత మార్కెట్లో మంచి గిరాకీ ఉన్నప్పటికీ

మిగతా 2లో..



## గుదిబండలా రాజోలిబండ

- కర్నాటక అక్రమాలతో తెలంగాణకు తీవ్ర నీటి కొరత
- 87,500 ఎకరాల సాగునీటి ప్రాజెక్టు
- అలంపూర్ ఆయకట్టు కోసం కృష్ణా జలాల మళ్లింపు
- ఆనకట్ట పనుల కోసం కర్నాటకకు తెలంగాణ నిధులు
- నిధుల కొరతతో నిలిచిన కీలక రిజర్వాయర్
- తుమ్మిళ్ల స్టేజ్-2 పూర్తి చేసి అక్రమాలను అడ్డుకోవాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలకు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ అత్యంత ప్రధానమైన జీవనాధారంగా నిలుస్తోంది. కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల గుండా ప్రవహించే తుంగభద్ర నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు అంతర్రాష్ట్ర నీటిపారుదల రంగానికి ఒక అద్దం పడుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన హెడ్ వర్క్స్ కర్నాటకలోని రాయచూర్ ప్రాంతంలో ఉన్నప్పటికీ దీని ద్వారా లభించే జలాల వల్ల రాయచూర్ జిల్లాతో పాటు తెలంగాణలోని జోగులాంబ గద్వాల, ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా రైతాంగం ఎంతో

మిగతా 3లో..



## కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఆగవు

- కేంద్ర పనితీరుకు ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదు
- 50:50 నిష్పత్తిలో భాగస్వామ్యానికి కేంద్రం సిద్ధం
- తెలంగాణలో రూ.1.75 లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి
- సికింద్రాబాద్, నాంపల్లి సహా 42 స్టేషన్ల ఆధునీకరణ

03

## నోటిఫికేషన్లు అడిగితే లాఠీ దెబ్బలా?



- ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత, విద్యార్థుల రోడ్‌షో ఆందోళనలు
- నిరసనకారులపై పోలీసుల దాడి, అరెస్టులపై తీవ్ర దుమారం
- శాంతియుత అభ్యర్థులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించిన కేటీఆర్
- 2 లక్షల ఉద్యోగాలంటూ కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శ
- 20 వేల కానిస్టేబుల్ ఖాళీలుంటే.. 5 వేలే ఇవ్వడం అన్యాయం
- వెంటనే 20,000 కానిస్టేబుల్ పోస్టులతో మెగా నోటిఫికేషన్ ఇవ్వాలి

02

# ఎగవేతల రేవంత్‌రెడ్డి

- గురుకులాల్లో రూ.2వేలకోట్ల కుంభకోణం వాస్తవం
- సొంతశాఖల టెండర్లపై మంత్రులకు అవగాహన లేదు
- రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్‌కు ఉరితాడు బిగించే కుట్ర
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపి విద్యార్థుల జీవితాలు ఆగం
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేవుని సాక్షిగా రుణమాఫీ, పెన్షన్లు, స్కీములన్నీ ఎగ్గొట్టిన ముఖ్యమంత్రిని ఇకపై ఎగవేతల రేవంత్ రెడ్డి అని పిలుద్దామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అల్గునూర్‌లోని లక్ష్మీనర సింహ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నేతలు నాయకులు జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మానకొండూర్ కార్యకర్తలు తెలంగాణ ఉద్యమంలో ఊరూరా ఎంత అద్భుతంగా పోరాడారో నాకు తెలుసు. 2001లో పార్టీ పెట్టిన తొలినాళ్లలోనే అన్ని జెడ్పీటీసీలు, ఎంపీపీలు గెలిచిన కరుడుగట్టిన కార్యకర్తలున్న గొప్ప నియోజకవర్గం ఇది. అధికారంలో ఉన్నా లేకపోయినా బ్రహ్మాండమైన బలగం ఉన్న పార్టీ మన బీఆర్ఎస్ అని తెలిపారు. మన కార్యకర్తల మీద ఉద్దేశపూర్వకంగా కేసులు పెడుతున్నారు. దేవేందర్, వేణు, రసమయి, సోషల్ మీడియా తమ్ముళ్లు సతీశ్, సది.. ఇలా అందరి మీద పదేళ్ల కిందటి కేసులు తీసి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఓటమి అంచున ఉండి, ఫ్రస్ట్రేషన్ లో ఉన్నవాడు మాత్రమే కేసులు పెడతాడు. వాళ్లు ఎన్ని కేసులు పెడితే మన గెలుపు అంత దగ్గరికి వస్తున్నట్టు లెక్క అన్నారు. రేవంత్ రెడ్డి అప్పుడప్పుడు బీఆర్ఎస్ శ్మశానానికి పోయిందని, చచ్చిన పాము అంటుంటాడని.. ఈయన మొహానికి మొలకెత్తిన వడ్లు కొనే తెలివి లేదు కానీ బీఆర్ఎస్‌ను మొలకెత్తనియ్యనని ప్రగల్భాలు పలుకుతున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పతారా ఖతమైపోయిందని, మొన్న వర్షాలు పడి ట్రాఫిక్ జామ్ అయితే నేను చెప్పినా ఏ ఆఫీసర్ వింటలేదు అని ముఖ్యమంత్రే స్వయంగా అంటున్నాడని విమర్శించారు. 'నీ పని అయిపోయింది. నువ్వు ఉండేది లేదని అధికారులకు అర్థమైంది కాబట్టే నీ మాట వినడం లేదు' అన్నారు. 'రేవంత్ రెడ్డి పాలనలో స్కీములు లేవు, అన్నీ స్కాములే. సివిల్ సప్లై, సింగరేణి, కరెంటు, భూములు, చివరకి గురుకులాల్లో పిల్లలకు అన్నం పెట్టే ఉప్పు, పప్పు, కోడిగుడ్లలో కూడా స్కామే. కానీ. కేసీఆర్ పాలనలో మేనిఫెస్టోలో చెప్పకపోయినా కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతు బంధు, రైతుబీమా ఇచ్చాం. గురుకులాల్లో 2000 కోట్ల స్కామ్ జరిగిందని నేను వాస్తవాలు మాట్లాడితే, మంత్రులు లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ గారు నాకు ఛాలెంజ్ చేస్తున్నారు. బట్టలు, బూట్లకు 1200 కోట్లు, ఉప్పులు పప్పులు కోడిగుడ్లకు 800 కోట్లతో టెండర్లు పిలిచిన విషయమే సంబంధిత మంత్రులకు తెలవకపోతే నేను వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. అనుముల వారి అన్నదమ్ములే ఈ టెండర్లన్నీ మింగుతున్నారు. కోటిమంది మహిళల్ని కోటీశ్వరులను చేస్తా అన్నాడు కానీ ఎనుముల వారి నలుగురు అన్నదమ్ములు మాత్రమే కోటీశ్వరులు అయ్యారు. ఉపాధి హామీ కూలీలకు "ఇందిరమ్మ ఆత్మీయ భరోసా" కింద ఏడాదికి 12000 రూపాయలు ఇస్తామని మూడు బడ్జెట్లలో చదివారు. ఏ ఒక్క కూలీకి అయినా ఒక్క రూపాయి వచ్చిందా? బల్లలు కొట్టుడు తప్ప పేదవాడి కడుపు నిండింది లేదు' అంటూ విమర్శలు గుప్పించారు. 'ఖజానా ఖాళీ అంటడు. కానీ ఫ్యూచర్ సిటీలో 100 కోట్లతో, ఎంసీహెచ్ఆర్డీలో మరో 100 కోట్లతో క్యాంప్ ఆఫీసులు కట్టుకోవడానికి, సచివాలయంలో వాస్తు మార్పులకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాడు. మెస్సీ ఫుట్ బాల్ షోకులకు, మూసీ సుందరీకరణకు, ఇతర రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ ఎన్నికలకు ఫుల్ పేజీ యాడ్లు ఇవ్వడానికి, ఢిల్లీకి మూటలు పంపడానికి మాత్రం రేవంత్ రెడ్డికి వందల కోట్లు ఎక్కడినుంచి వస్తున్నాయి? దేవుని మీద ఒట్టుపెట్టి ఆగస్టు కల్లా రుణమాఫీ చేస్తా అని దేవున్నే మోసం చేసిండు. 100 రోజుల్లో రూ.4000 పెన్షన్, రూ.2500 మహాలక్ష్మి ఎగబెట్టిండు. ఇవన్నీ ఎగ్గొట్టిన వాడిని ఎగవేతల రేవంత్ రెడ్డి అనక ఏమనాలి? ఈ మాట అన్నందుకే మానకొండూరు పోలీస్ స్టేషన్లో నా మీద కేసు పెట్టి నోటీసులు పంపారు, అయినా బరాబర్ అంటాను. మృగశిర కార్తె వచ్చినా కళ్లాల్లో వడ్లు కొంటలేరు, బస్తాలకు చెదలు పడుతున్నాయి. ఏడ పోయినా 5 కిలోల తరుగు పెడుతున్నారు. 'రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత ఏకంగా మూడు రైతు బంధులు ఎగబెట్టిండు. ఒకసారి పూర్తిగా ఎగబెట్టి 9000 కోట్లు, తర్వాత మూడు ఎకరాలకు ఇచ్చి 4000 కోట్లు, ఇప్పుడు రెండు ఎకరాలకు ఇచ్చి 6000 కోట్లు.. మొత్తం 19వేల కోట్ల రూపాయల రైతు బంధు బాకీ పడ్డాడు. ఈ బాకీ పడ్డ 19వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని మానకొండూరు గడ్డ మీద నుంచి డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ రాగానే మళ్లీ పాతకాలం వచ్చింది. ఎరువులకు యాప్ పెట్టి పోలీస్ స్టేషన్లలో లైన్లు కట్టే పరిస్థితి తెచ్చారు. రైతు బీమాకు ఎల్ఐసీకి పైసలు కట్టక అది కూడా నాలుగు నెలలుగా బంద్ అయిపోయింది. పోయిన యాసంగి, ఈ యాసంగి కలిపి 2100 కోట్ల బోనస్ ఎగ్గొట్టి బోనస్‌ను బోగస్ చేశారు. 24 గంటల కరెంటు పోయి ఇప్పుడు 9 గంటలకు వచ్చింది. ఇప్పుడు రైతు డిస్కమ్ అనే కొత్త భూతం తేబోతున్నారు. ఇది వస్తే పొద్దున ఎండ ఉన్నప్పుడు 78 గంటలు మాత్రమే పవర్ ఇస్తారు. కాంగ్రెస్ నాయకులు ఈఆర్సీ ముందు 3 గంటల కరెంట్ చాలు అంటున్నారు. ఈ రైతు డిస్కమ్ అమల్లోకి వచ్చిందంటే ఉచిత కరెంటుకు ఉరివేసినట్టే. కాంగ్రెస్ కు ఓటేసిన రైతులు కూడా ఇప్పుడు బాధపడుతున్నారు' అని గుర్తు చేశారు. 'ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇయ్యక 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేస్తున్నాడు. ఫీజులు రాక డిగ్రీలు, పీజీలు అయిపోయినా కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. కరోనా వచ్చినా, నోట్ల రద్దు జరిగినా మన 9న్నర ఏళ్లలో 19,500 కోట్ల రూపాయల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇచ్చాం. కానీ, రేవంత రెడ్డి వచ్చి మూడేళ్లు దగ్గరపడుతున్నా ఒక్క రూపాయి ఇయ్యలే. మా ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల చదువులకు పైసలు ఇస్తే కమిషన్లు రావని, 1015శాతం కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు మాత్రం కోట్లు బిల్లులు ఇస్తున్నాడు. ఎలక్షన్ల ముందు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అన్నాడు. బయట సభల్లో 68 వేలు ఇచ్చాం అని అబద్ధాలు చెప్తూ, అసెంబ్లీలో మాత్రం కేవలం 16,000 మాత్రమే ఇచ్చామని స్వయంగా ముఖ్యమంత్రే ఒప్పుకున్నాడు. కొత్త డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ శాఖలో 19వేల ఖాళీలు ఉన్నాయని చెప్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం కేవలం 5వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇస్తా అంటున్నాడు. నిరుద్యోగులు దిల్ సుఖ్ నగర్, చిక్కడపల్లిలో ధర్నాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కేసీఆర్ గారు ఒకేసారి 17,000 పోలీసు ఉద్యోగాలను నింపారు' అంటూ ధ్వజమెత్తారు హరీశ్‌రావు. 'ఎలక్షన్ల ముందు ఉద్యోగాలకు అప్లికేషన్ ఫీజు ఫ్రీ అన్నాడు, అధికారంలోకి రాగానే 400 ఉన్న ఫీజును 800 చేసి డబుల్ బాదుడు బాదుతున్నాడు. నిరుద్యోగులను ఘోరంగా మోసం చేశాడు. రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడంతో మానకొండూర్, అల్గనూర్, తిమ్మాపూర్ లాంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయింది. ఆఫీసుల్లో ఈగలు తోలుకుంటున్నారు, ప్లాటు అమ్ముకుందామన్నా కొనే దిక్కు లేదు. ఆర్టీఏ చార్జీలు పెంచిండు. మోటార్ సైకిల్‌కు 5000, పెద్ద బండికి 10వేలు, కారుకు 20వేలకు పెంచిండు. ఆడవాళ్లకు ఫ్రీ బస్సు అని చెప్పి మగోళ్లకు డబుల్ టికెట్ రేట్లు పెంచిండు. బీరు సీసాలకు పెంచిండు, రేపటి నుంచి క్వార్టర్ కు, విస్కీకి కూడా పెంచుతాడట. పెంచుడు, దంచుడు, కమిషన్లు కొట్టుడు తప్ప చేసిందేమీ లేదు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదేళ్లలో కొత్తగా 23 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చినాం, మిడ్ మానేరును పూర్తి చేసి ముంపు బాధితులకు పరిహారం ఇచ్చాం. రేవంత్ రెడ్డి ఈ రెండున్నర ఏళ్లలో కనీసం రెండు ఎకరాలకైనా నీళ్లు ఇచ్చిండా?' అని ప్రశ్నించారు.

# వరి వద్దు?

**మొదటిపేజీ తరువాయి**

చాలామంది రైతులు పెసర, మినుము పంటల సాగు పట్ల అంతగా శ్రద్ధ చూపడం లేదు. ఈ పంటలు కేవలం 75 నుండి 90 రోజుల్లోనే చేతికి వస్తూ తక్కువ కాలంలోనే మంచి ఆదాయాన్ని అందిస్తాయి. ఇసుకతో కూడిన ఎర్ర నేలలు ఈ రకమైన పప్పుధాన్యాల సాగుకు అత్యంత అనువైనవిగా నిర్ధారించారు. అతి తక్కువ నీటి తడులతోనే ఇవి నాణ్యమైన పంటను ఇస్తాయి కాబట్టి వర్షాభావ పరిస్థితుల్లో ఇవి అద్భుత ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి. స్వల్పకాలిక పంటల వల్ల తక్కువ సమయంలోనే పెట్టుబడి తిరిగి చేతికి వచ్చే అవకాశం మెరుగ్గా ఉంటుంది. వేరుశనగ సాగుకు భూమి వదులుగా ఉండటం ఎంతో ప్రధానమైన అంశం. ఇసుక శాతం ఎక్కువగా ఉండే ఎర్ర నేలల్లో వేరుశనగ కాయలు ఊరడం చాలా సులువవుతుంది. భూమి లోపల కాయలు పెరిగే ఈ పంటకు తక్కువ నీరు సరిపోతుంది. అధిక వర్షాల వల్ల ఈ పంట దెబ్బతినే అవకాశం ఉంది కాబట్టి ఎల్‌నినో వల్ల వచ్చే అల్ప వర్షపాతం దీనికి ఒక రకంగా అనుకూలంగానే మారుతుంది. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ పంట ద్వారా తక్కువ ఖర్చుతోనే ఆశించిన స్థాయి కంటే ఎక్కువ లాభాలు పొందవచ్చు. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సోయాబీన్ పంటను సాగు చేయడం ఎంతో లాభదాయకం. భూమిలో తేమను ఎక్కువ కాలం నిలిపి ఉంచే గుణం నల్లరేగడి మట్టికి ఉంటుంది కాబట్టి ఈ పంట అక్కడ బాగా ఎదుగుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక ప్రొటీన్లు కలిగిన సోయాబీన్‌ను పండించడం ద్వారా మార్కెట్లో మంచి ధరను పొందవచ్చు. నీటి వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ సమర్థవంతమైన యాజమాన్య పద్ధతులతో దీనిని లాభసాటిగా మార్చవచ్చు. పారిశ్రామికంగా కూడా ఈ పంటకు గిరాకీ నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాల పంటలకు నీటి అవసరం చాలా స్వల్పంగా ఉంటుంది. ఎలాంటి సమస్యాత్మక నేలల్లోనైనా ఇవి తట్టుకుని నిలబడగలవు. వర్షాలు అసలు పడవు అనుకున్న ప్రాంతాల్లో సైతం ఈ పంటలు సులువుగా పెరుగుతూ రైతులకు కనీస ఆదాయాన్ని గ్యారెంటీగా అందిస్తాయి. మారిన ఆహార అలవాట్ల వల్ల మార్కెట్లో వీటికి డిమాండ్ కూడా భారీగా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాలలో చిరుధాన్యాల వినియోగం పెరగడం వల్ల వీటికి మంచి విక్రయ అవకాశాలు లభిస్తున్నాయి. మొక్కజొన్న పంట తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ అధిక దిగుబడిని ఇచ్చే అద్భుతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఖరీఫ్ సీజన్ మొత్తంలో దీనిని ఎప్పుడు వేసినా ఆశించిన స్థాయిలోనే ఫలితాలు వస్తాయి. పశుగ్రాసంగా, పారిశ్రామిక అవసరాలకు దీని వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల మార్కెటింగ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. తక్కువ నీటితోనే ఎక్కువ బయోమాస్ ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంది. కోళ్ళ ఫీడ్ తయారీ పరిశ్రమల నుండి దీనికి విపరీతమైన డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి గణాంకాల ప్రకారం విభిన్న పంటలు ఒక కిలో దిగుబడిని ఇవ్వడానికి తీసుకునే నీటి పరిమాణం లీటర్లలో పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడవుతాయి. ఒక కిలో గోధుమల ఉత్పత్తికి 1159 లీటర్ల నీరు అవసరమవుతుంది. మన దేశంలో అత్యధికంగా సాగయ్యే ఒక కిలో వరి ధాన్యం పండించాలంటే ఏకంగా 1408 లీటర్ల నీటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనితో పోలిస్తే ఒక కిలో మొక్కజొన్న కేవలం 710 లీటర్ల నీటితోనే పూర్తవుతుంది. ఒక కిలో బంగాళాదుంపల ఉత్పత్తికి 105 లీటర్లు మాత్రమే అవసరం కాగా, అత్యధికంగా ఒక కిలో సోయాబీన్ పండించడానికి 2860 లీటర్ల నీరు అవసరమవుతుందని శాస్త్రవేత్తల లెక్కలు చెబుతున్నాయి.



# వ్యవసాయరంగానికి డిజిటల్ హంగులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో సాగుకు సంబంధించి విత్తనాల సరఫరా నుంచి పండిన పంటల కొనుగోలు వరకు ప్రతి దశను సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే రైతుల వివరాలు, పంట విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కొనుగోళ్ల వరకు పూర్తిస్థాయి డేటా వ్యవసాయ శాఖ వద్ద ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వర్షాల పరిస్థితి, సాగు సన్నద్ధతపై విస్తృతంగా చర్చించి కీలక దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి వల్ల రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు పడుతున్నందున, కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్ర అవసరాలను తీర్చుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో గత అనుభవాలను సమీక్షించిన సీఎం, రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. కొనుగోలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ విత్తనాల పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రతి దశను పర్యవేక్షించనుంది. గ్రామస్థాయిలో రైతులు వేసే పంటలు, సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంచనాలు వంటి వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేసి డిజిటల్ వ్యవస్థలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాల ప్రకారం కొనుగోళ్లు సాఫీగా జరగాలని ఆదేశించిన సీఎం, అకాల వర్షాలు, రవాణా, తూకం, నిల్వ వంటి అంశాలకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లకు బోనస్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. సబ్సిడీపై విత్తనాల పంపిణీ చేయాలని, సన్న వడ్లు పండించే రైతులపై పూర్తి డేటా సేకరించాలని చెప్పారు. రైతు వేదికలను ఇకపై పూర్తి స్థాయి సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అక్కడే విత్తనాలు, ఎరువుల కొనుగోలు, రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో చేపట్టిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను అధ్యయనం చేసి వ్యవసాయ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సీఎం సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక యాప్ ద్వారా బుకింగ్ వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ జరగాలని, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లు దీనిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఖరీఫ్‌కు అవసరమైన యూరియా సరఫరాపై కేంద్రంలోని బీజేపీ సర్కారుతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సీఎం సూచించారు. కేంద్రం నిర్లక్ష్యం వల్ల ఎరువుల కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. రామగుండం ఎరువుల కర్మాగారం ఉత్పత్తిలో రాష్ట్రానికి దక్కాల్సిన వాటాను ఎక్కువగా కేటాయించేలా కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. అవసరమైతే అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతలపై విజ్ఞప్తి చేయాలని ఆదేశించారు. మార్క్‌ఫెడ్ పనితీరుపై సమీక్షించిన సీఎం, వ్యాపార ఒత్తిడులకు లోబడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడం వల్ల మొక్కజొన్న కొనుగోళ్లలో గతంలో కంటే నష్టాలు తగ్గించగలిగామని పేర్కొన్నారు. ఆయిల్‌ఫెడ్‌ను లాభదాయకంగా తీర్చిదిద్దాలని, ప్రభుత్వ డైరీని బలోపేతం చేసి పాల రైతులకు చెల్లింపులు సమయానికి చేయాలని ఆదేశించారు. సాగులో ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2600లకు పైగా ఉన్న రైతు వేదికలను కేవలం భవనాలుగా కాకుండా, వ్యవసాయ ఉత్పాదక కేంద్రాలుగా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అక్కడే దొరకాలి. విత్తన పంపిణీలో పారదర్శకత లేకపోతే అనర్థాలు తప్పవని, పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని సీఎం స్పష్టం చేశారు. బీజేపీ నేతలు కేంద్రంలోని అధికారంతో రాష్ట్రానికి వచ్చే నిధులను, ఎరువుల కోటాను కుదించేలా వ్యవహరిస్తుండటం దురదృష్టకరమని, రైతుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. రైతులకు మేలు చేసే ప్రతి విషయంలోనూ అధికారులు అత్యంత నిబద్ధతతో పనిచేయాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని సీఎం హెచ్చరించారు. సాగులో ఆధునిక సాంకేతికతను జోడించి, రైతుల కష్టాలను తగ్గించడం ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం. ఏఐ ప్రాజెక్టు ద్వారా పంటల దిగుబడి, చీడపీడల నివారణ వంటి అంశాల్లో రైతులను అప్రమత్తం చేసే విధానాన్ని వేగవంతం చేయాలి. కేంద్రం నుంచి సరైన సహకారం అందకపోయినా, రాష్ట్ర సొంత నిధులతో రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం ప్రకటించారు. ఎరువులు, విత్తనాల విషయంలో కాలానుగుణంగా డిమాండ్ అంచనా వేసి సరఫరాలో లోటు లేకుండా చూడాలని వ్యవసాయ శాఖకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. రైతుల అభ్యున్నతి కోసం పనిచేయడంలో అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపడాలని ఆయన ఆకాంక్షించారు. మొక్కజొన్న, ఆయిల్‌ఫెడ్ వంటి విభాగాల్లో మార్కెటింగ్ సామర్థ్యం పెంచడం వల్ల గత పంట సీజన్లలో కొంత మేరకు మెరుగైన ఫలితాలు వచ్చాయని సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. పాల రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా, ప్రభుత్వ డైరీని సమర్థంగా నిర్వహించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని సీఎం సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని విఫల విధానాలను అనుసరించకుండా, తెలంగాణ మోడల్ వ్యవసాయ విధానాన్ని అమలు చేయడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచాలి. రైతు వేదికల వద్ద రిజిస్ట్రేషన్లు వేగవంతం కావాలని, ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరం సాగులోకి రావాలని, రైతుల కష్టాలు తీరాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు సన్న వడ్లు పండించేలా ప్రోత్సహించడం వల్ల వారికి అదనపు లాభం చేకూరుతుంది. బోనస్ ప్రకటించిన ప్రభుత్వం, ఏడు రకాల సన్న వడ్ల విత్తనాల లభ్యతపై ప్రత్యేక నివేదికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ అనాసక్తి వల్ల రాష్ట్ర రైతులు అనేకసార్లు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు అటువంటి పరిస్థితి రాకూడదనే దృఢ సంకల్పంతో ఉన్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమం కోరుకుంటున్నాం కాబట్టే, కేంద్రంపై ఒత్తిడి పెంచి మన హక్కులను సాధించుకుంటాం. సమగ్ర ప్రణాళికతో ముందడుగు వేయడం వల్ల ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు లాభసాటిగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని మరోమారు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంస్కరణ రైతు కళ్లలో ఆనందం చూసేందుకేనని, కేంద్రం చేసే అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాగుకు అవసరమైన అన్ని వనరులు సమకూర్చడం, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచడం వంటి అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. ప్రతి రైతు వేదిక వద్ద అధికారులు ఉండటం వల్ల క్షేత్రస్థాయి సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయి. డిజిటల్ డేటా ద్వారా రైతులకు భరోసా ఇవ్వాలి.

# నోటిఫికేషన్లు అడిగితే లాఠీ దెబ్బలా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చుట్టూ జరుగుతున్న పరిణామాలు ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. తమ భవిష్యత్తు కోసం, ఉపాధి అవకాశాల కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేయడం పౌరుల ప్రాథమిక హక్కు. అటువంటి హక్కును కాలరాస్తూ, వీధుల్లో అభ్యర్థులను వెంటాడటం, వారిపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టులు చేయడం వంటి చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ రకమైన అణచివేత ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని విపక్షాలు బలంగా వాదిస్తున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో ఉద్యోగాల భర్తీ కోసం శాంతియుత మార్గంలో నిరసనలు ప్రదర్శించిన యువతీ యువకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం తీవ్ర దుమారం రేపింది. తమ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని భావించిన నిరుద్యోగులపై లాఠీలు ఝుళిపించడం సముచితం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసనకారులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నిరుద్యోగుల గొంతును నొక్కేందుకు ప్రయత్నించడం ద్వారా ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వారు నడుచుకునే తీరుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఈ నిరసనలు స్పష్టం చేస్తున్నాయి. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఒకే ఏడాది వ్యవధిలో 200000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించింది. దానికి తోడు భారీగా మెగా నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, పక్కాగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఆశలు కల్పించింది. ఈ వాగ్దానాలను నమ్మి యువత ఆ పార్టీకి మద్దతు పలికినప్పటికీ, నేడు అధికార పీఠం ఎక్కిన తర్వాత నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవహరిస్తోందని విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాల భర్తీ కోసం నిరంతరాయంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కొత్త నోటిఫికేషన్లు జారీ చేయాలంటూ అనేక రోజులుగా పలు రకాల నిరసన కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వంలో ఎలాంటి చలనం కనిపించడం లేదు. విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనను, వారి ఆవేదనను పాలకులు కనీసం పట్టించుకోకపోవడం పట్ల కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యావంతులైన యువత రోడ్లపాలవుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పరిశీలిస్తే ప్రభుత్వ ఉద్దేశం స్పష్టమవుతుందని నిరుద్యోగ సంఘాలు చెప్తున్నాయి. ప్రస్తుతం పోలీస్ శాఖలో 20000 కి పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 5000 పోస్టుల భర్తీతోనే సరిపెట్టుకోవాలని చూడటం అన్యాయమైన చర్యగా పరిగణించబడుతోంది. అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులకు నిరాశే మిగులుతుందని, అర్హులైన నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలోని నిరుద్యోగ అభ్యర్థులు సుదీర్ఘకాలంగా హైదరాబాద్‌లోని వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన అభ్యర్థులు ఇక్కడ గదులను అద్దెకు తీసుకుని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను భరిస్తూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కష్టపడి పంపించే డబ్బులతో కాలం వెళ్లదీస్తూ, ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో శ్రమిస్తున్నారు. ఇటువంటి అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి డిమాండ్లకు అనుగుణంగా తక్షణమే 20000 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో కూడిన మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దిల్‌సుఖ్‌నగర్‌లో తమ హక్కుల సాధన కోసం వీరోచితంగా పోరాడి పోలీసుల చేతిలో అరెస్టయిన నిరుద్యోగ జేఏసీ నాయకులను, విద్యార్థులను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలి. జైళ్లలో పెట్టి అణచివేయాలని చూడటం వల్ల సమస్య పరిష్కారం కాదని, మరింత జటిలమవుతుందని హెచ్చరికలు వస్తున్నాయి. లాఠీలతో నిరుద్యోగుల గొంతును తాత్కాలికంగా నొక్కాలని చూస్తే, ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడినట్టేనని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసనల అణచివేత అనేది పాలకుల పతనానికి నాంది పలుకుతుందని చరిత్ర నిరూపించిందని ఆయన గుర్తు చేశారు. నిరుద్యోగ యువత గుండెల్లో పేరుకుపోయిన ఆవేదనను, వారి న్యాయమైన డిమాండ్లను లాఠీ దెబ్బలతో గానీ, పోలీసు కేసులతో గానీ అణచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. నిరుద్యోగుల శక్తి చాలా గొప్పదని, వారి ఆగ్రహానికి గురైన ఏ ప్రభుత్వము నిలదొక్కుకోలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు వ్యవస్థను నిరుద్యోగులపైకి ఉసిగొల్పడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా పాలకులు తమ ధోరణిని మార్చుకుని, విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుత నిరసనల నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ జేఏసీ తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వ వైఖరి నశించే వరకు, తమకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేదే లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం నిరుద్యోగులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడతామని చెప్తున్నాయి.

# విజ్ఞానం నైపుణ్యమే మాదిగల అభ్యున్నతికి ఆయుధాలు

**ఆడెపు శ్రీనివాస్ మాదిగ**

**మోటకొండూరు, విశాలాభారతి:** మోటకొండూరు మండలం కొండాపురం గ్రామంలో మంగళవారం ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు నిర్వహిస్తున్న "గో టు విలేజ్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, తరతరాలుగా విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన మాదిగ సమాజం విజ్ఞానం, నైపుణ్యాన్ని ఆయుధాలుగా చేసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు లభిస్తున్న 9 శాతం రిజర్వేషన్లను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని సూచించారు. మాదిగలలో అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇకపై ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా చూడాలని, ప్రాథమిక, మాధ్యమిక విద్యకు దూరమైన పిల్లలను తిరిగి బడిబాట పట్టించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొండాపురం గ్రామ ఎంఆర్పీఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా గుడ్డేటి రమేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా గుడ్డేటి ఐలయ్య మాదిగ, చెరుపల్లి నరేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గుడ్డేటి సాయికుమార్ మాదిగ, కార్యదర్శిగా గుడ్డేటి బిక్షపతి మాదిగ, సహాయ కార్యదర్శిగా గుడ్డేటి కిష్టయ్య మాదిగ, కోశాధికారిగా గుడ్డేటి శంకరయ్య మాదిగలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గుడ్డేటి స్వామి, గుడ్డేటి మల్లయ్య, ఆడెపు యాదగిరి, గుడ్డేటి రాములు, చెరుపల్లి బిక్షపతి, గుడ్డేటి రవితేజ, గుడ్డేటి మల్లేష్ తదితరులను ఎంపిక చేశారు. అలాగే ఎంఎస్పీ గ్రామ శాఖ కమిటీని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుడ్డేటి శ్రీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షులుగా గుడ్డేటి చందు మాదిగ, సిరిపంగా భాష మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గుడ్డేటి ఎలేందర్ మాదిగ, కార్యదర్శిగా సిరిపంగా చరణ్ మాదిగ, సహాయ కార్యదర్శిగా గుడ్డేటి శివకుమార్ మాదిగ, కోశాధికారిగా గంగారం బిక్షపతి మాదిగలను ఎన్నుకోగా, కార్యవర్గ సభ్యులుగా కొండమడుగు గణేష్ మాదిగ, గంగారం రామకృష్ణ మాదిగ, గుడ్డేటి సత్యనారాయణ మాదిగ తదితరులను ఎంపిక చేశారు.



# ఇంటి నిండా నోట్ల కట్టలే!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరంలో అవినీతి తిమింగలాల వేట తీవ్రరూపం దాల్చింది. అవినీతి నిరోధక శాఖ అధికారులు తాజాగా మరో భారీ తిమింగలాన్ని తమ వలకి చిక్కించుకున్నారు. ల్యాండ్స్ అండ్ సర్వే విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్న సుంకరి నరహరి ఇల్లే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా కూడబెట్టారనే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు మంగళవారం ఉదయం నుంచే ఏకకాలంలో తనిఖీలను ప్రారంభించాయి. పాతబస్తీలోని ఛత్రినాక పరిధిలో గల ఆయన ప్రధాన నివాసంలో సోదాలు చేస్తున్న అధికారులకు తవ్వేకొద్దీ లభ్యమవుతున్న అక్రమ సంపద నిధులు చూసి నోరెళ్లబెట్టడం అక్కడి అధికారుల వంతయింది. ఈ భారీ సోదాల పర్వం కేవలం ఛత్రినాకలోని నరహరి ప్రధాన నివాసానికే పరిమితం కాలేదు. ఆయనకు అత్యంత ఆప్తులైన బంధువుల ఇళ్లు, సన్నిహితుల నివాసాలు, కార్యాలయాల్లోనూ ఏకకాలంలో ప్రత్యేక బృందాలు విస్తృతమైన తనిఖీలను చేపట్టాయి. నరహరి ఇంట్లో జరుగుతున్న శోధనలో భాగంగా వివిధ గదులు, రహస్య లాకర్లలో దాచి ఉంచిన నోట్ల కట్టలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కిలోల కొద్దీ తూగే బంగారం, వెండి ఆభరణాలు ఇక్కడ లభించడం విశేషం. అధికారులు ఊహించని రీతిలో అత్యంత విలాసవంతమైన సంపద ఇక్కడ బయటపడటం సంచలనం సృష్టిస్తోంది. అవినీతి అధికారి నరహరి ఇంట్లో వెలుగుచూసిన ఒక విస్తుపోయే నిజం దర్యాప్తు అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ప్రతిరోజూ నిద్రించే మంచం కింద సాధారణంగా ఉండే ఖాళీ స్థలంలో నిలువునా నోట్ల కట్టలను పేర్చినట్లు గుర్తించారు. మంచం నిండా కరెన్సీ కట్టలను పరిచి, వాటిపై పరుపు వేసుకుని పడుకునే అలవాటు ఆయనకు ఉందని తెలిసి అధికారులు అవాక్కయ్యారు. దొరికిన నోట్ల కట్టల విలువ కోట్లాది రూపాయలలో ఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. నగదును వేగంగా లెక్కించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటింగ్ మిషన్లను సోదాలు జరుగుతున్న చోటుకి రప్పించారు. ఈ సోదాల్లో కేవలం గుట్టల కొద్దీ నగదు, కేజీల కొద్దీ బంగారం మాత్రమే కాకుండా స్థిరాస్తుల చిట్టా కూడా బయటపడింది. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధి



లోని అత్యంత విలాసవంతమైన, ఖరీదైన ల్యాండ్ ప్లాట్లకు సంబంధించిన కీలకమైన ఒరిజినల్ భూ పత్రాలను అధికారులు హస్తగతం చేసుకున్నారు. సర్వే డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ప్రభుత్వ భూములను, ప్రైవేటు రికార్డులను సైతం తారుమారు చేస్తూ భారీగా భూములను వెనకేసుకున్నారనే బలమైన ఆరోపణలు నరహరిపై వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏసీబీ ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్న పలు రెవెన్యూ రికార్డులు, విలువైన రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా విచారణను క్షుణ్ణంగా జరుపుతున్నారు. ప్రభుత్వ సర్వీసులో ఉంటూ అత్యంత అక్రమ మార్గాల్లో వందల కోట్ల రూపాయల మేర ఆస్తులను కూడబెట్టినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నరహరి వెనుక ఉన్న బినామీల నెట్‌వర్క్‌పై కూడా ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాలలో ఈ దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. సోదాలు పూర్తిగా ముగిసే సమయానికి మరిన్ని విస్తుపోయే నిజాలు, అదనపు అక్రమ ఆస్తుల పూర్తి వివరాలు అధికారికంగా బయటకు వచ్చే అవకాశం పుష్కలంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ లంచాల రూపంలో వచ్చిన నల్లధనాన్ని నిల్వ చేసేందుకు నరహరి సరికొత్త మార్గాలను అన్వేషించినట్లు స్పష్టమవుతోంది. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ సంపాదించిన ప్రతి రూపాయిని ఇలా తన విలాసాల కోసం దాచుకున్న వైనం బయటపడింది. ఏసీబీ చరిత్రలోనే ఒక ఉన్నత స్థాయి అధికారి ఇంట్లో ఈ తరహాలో మంచం కింద నోట్ల కట్టలు లభించడం అత్యంత అరుదైన విషయంగా చెప్పుకోవచ్చు. దొరికిన డాక్యుమెంట్ల ప్రకారం రంగారెడ్డి జిల్లా పరిధిలోని కీలకమైన ప్రాంతాల్లో దాదాపుగా 50 ఎకరాల వరకు విలువైన భూములు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ ప్రస్తుతం వందల కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోదాలు సాగుతున్న కొద్దీ నరహరి బినామీల జాబితా రోజురోజుకూ పెద్దదవుతోంది. సుమారు 10 మందికి పైగా బినామీల పేరిట నరహరి అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. ఇళ్ల స్థలాలతో పాటు కొన్ని వాణిజ్య సముదాయాలలో సైతం వాటాలు ఉన్నట్లు సమాచారం అందుతోంది. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో కూడా పెట్టుబడులు పెట్టినట్లు డైరీలు లభించాయి. స్వాధీనం చేసుకున్న 3 డైరీలలోని కోడ్ లాంగ్వేజ్ వివరాలను విశ్లేషించేందుకు సాంకేతిక నిపుణుల సహాయాన్ని తీసుకుంటున్నారు. బ్యాంక్ లాకర్లను తెరిస్తే మరింత బంగారం బయటపడే అవకాశం ఉంది. నరహరి ఆదాయ వనరులకు, ఆయన పేరిట ఉన్న ఆస్తులకు ఎక్కడా పొంతన లేకపోవడాన్ని ఏసీబీ బృందం గుర్తించింది. ప్రభుత్వ జీతం ద్వారా వచ్చే ఆదాయం కంటే దాదాపు 500 శాతం అదనపు ఆస్తులను ఆయన కలిగి ఉన్నట్లు ప్రాథమిక లెక్కింపుల్లో తేలింది. ఇవన్నీ గత 10 ఏళ్ల కాలంలోనే సంపాదించినట్లుగా రిజిస్ట్రేషన్ తేదీల ఆధారంగా నిర్ధారించారు. భూముల సర్వేల సమయంలో పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి లంచాల రూపంలో ఈ భూములను రాబట్టినట్లు తెలుస్తోంది.

# రేవంత్, హరీష్ రావులపై బీజేపీ కన్ను?

**మొదటిపేజీ తరువాయి**

నాయకులను నమ్ముకుని వ్యూహాలు రచించిన చందంగానే ఇక్కడ కూడా అదే ప్రయోగాన్ని పునరావృతం చేయాలని చూస్తున్నారు. స్థానికంగా పార్టీ జెండాను మోస్తున్న సొంత క్యాడర్‌ను విస్మరించి, ఇతర పార్టీలలోని అగ్రనేతలపై కన్నేయడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నలు క్షేత్రస్థాయిలో గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేత హరీష్ రావు వంటి ఇమేజ్ ఉన్న నాయకులను తమ వైపు తిప్పుకోవాలని బీజేపీ అధిష్టానం తీవ్రంగా ప్రయత్నిస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. స్వశక్తితో ఎదిగిన సొంత నాయకులను పక్కనబెట్టి ఇలాంటి వలస నేతలపై ఆధారపడటం ఒక రకమైన రాజకీయ ప్రమాదమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా వలస రాజకీయాల వల్ల పార్టీ కోసం రాత్రింబగళ్లు కష్టపడే ఒరిజినల్ కార్యకర్తలలో ఉత్సాహం తగ్గిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం అధికార పీఠాన్ని దక్కించుకోవడం కోసమే దశాబ్దాలుగా నమ్ముకున్న సిద్ధాంతాలను పక్కన పెట్టేయడం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని పాతతరం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెలంగాణ కాషాయ దళాన్ని సుదీర్ఘకాలం నడిపించిన జి. కిషన్ రెడ్డి శైలి ఎప్పుడూ కాస్త నెమ్మదిగా, రక్షణాత్మక ధోరణిలోనే సాగింది. అధిష్టానం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా రెండు కీలక బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆశించిన స్థాయిలో దూకుడు రాజకీయాలు కనిపించలేదు. పార్టీని వివాదాలకు దూరంగా సురక్షితమైన జోన్‌లో ఉంచడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇలాంటి స్తబ్ధత నెలకొన్న సమయంలో బండి సంజయ్ రంగప్రవేశంతో రాష్ట్ర కాషాయ రాజకీయాల చిత్రం పూర్తిగా మారిపోయింది. ఆయన తీసుకొచ్చిన సరికొత్త వేవ్, దూకుడు వైఖరి తెలంగాణ వ్యాప్తంగా పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహాన్ని, కొత్త జోష్‌ను నింపాయి. బండి సంజయ్ ఎప్పుడైతే రాష్ట్ర పార్టీ బాధ్యతలు స్వీకరించారో అప్పటినుండి మాస్ లీడర్‌గా ప్రజల్లోకి దూసుకుపోయారు. ఆయన ప్రదర్శించిన హిందుత్వ విధానం, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన



ప్రజా సంగ్రామ యాత్రలు, ప్రత్యర్థులకు ఓపెన్ ఛాలెంజ్‌లు విసిరే అగ్రెసివ్ పాలిటిక్స్ పార్టీని అగ్రపథాన నిలబెట్టాయి. అప్పటివరకు కేవలం మూడవ స్థానంలో ఉన్న కమలం పార్టీని అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన ప్రత్యామ్నాయంగా మార్చడంలో ఆయన వంద శాతం విజయం సాధించారు. ఆ సమయంలో రాష్ట్రంలో వచ్చిన ఉప ఎన్నికల ఫలితాలలో బీజేపీ తన అసలు సత్తాను చాటడం గమనార్హం. దుబ్బాక, హుజూరాబాద్ వంటి ప్రతిష్టాత్మక బై పోల్స్‌లో సాధించిన అద్భుత విజయాలు పార్టీ గ్రాఫ్‌ను ఒక్కసారిగా శిఖరాగ్రానికి తీసుకెళ్లాయి. కేవలం అసెంబ్లీ స్థానాలే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 48 డివిజన్లను కైవసం చేసుకుని రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచారు. ఈ విజయాల పరంపరలో దూసుకుపోతున్న తరుణంలోనే అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 05 నెలల ముందు హైకమాండ్ ఊహించని నిర్ణయం తీసుకుంది. బండి సంజయ్‌ను ప్రెసిడెంట్ పోస్ట్ నుండి సడన్‌గా తొలగించి మళ్లీ కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించడం తెలంగాణ రాజకీయాలలో అతిపెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారింది. అధిష్టానం తీసుకున్న ఈ ఒక్క తప్పుడు నిర్ణయం వల్ల కమలం వైపు రావాల్సిన ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ మొత్తం కాంగ్రెస్ వైపునకు మళ్లిపోయింది. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుండి తప్పించడం వల్లే హస్తం పార్టీకి అధికారం దక్కే లక్ కలిసివచ్చిందని క్షేత్రస్థాయి కార్యకర్తలు ఇప్పటికీ బలంగా నమ్ముతున్నారు. ఆ నిర్ణయం తీసుకోకుండా ఉంటే అసెంబ్లీలో ఫలితాలు ఖచ్చితంగా వేరేలా ఉండేవనే చర్చ నడుస్తోంది. సొంత లీడర్‌ను వెనక్కి నెట్టి వలస వచ్చిన ఈటల రాజేందర్ లాంటి వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం కూడా పార్టీకి తీవ్రమైన మైనస్ అయింది. ఈటల రాజేందర్ ఎంట్రీతో హుజూరాబాద్ ఉప ఎన్నికలో విజయం వచ్చినప్పటికీ ఓవరాల్‌గా రాష్ట్రవ్యాప్తంగా కాషాయ ఓటు బ్యాంక్‌ను బలోపేతం చేయడంలో ఆయన విఫలమయ్యారు. ఇప్పుడు మళ్లీ రేవంత్ రెడ్డి, హరీష్‌రావు వంటి బిగ్ షాట్స్‌పై ఢిల్లీ పెద్దలు ఫోకస్ పెట్టడం వారి రాజకీయ అసహనానికి నిదర్శనంగా కనిపిస్తోంది. బయటి పార్టీల నుండి వచ్చే లీడర్స్ తక్షణ పవర్ గేమ్‌లో తాత్కాలికంగా సహాయపడవచ్చు. క్షేత్రస్థాయిలో పార్టీ భావజాలాన్ని జనాల్లోకి బలంగా తీసుకెళ్లలేరనే సత్యాన్ని గ్రహించాలి. తెలంగాణ కాషాయ దళానికి ప్రస్తుత పరిస్థితుల్లో బండి సంజయ్ ఒక శక్తివంతమైన ఆయుధం లాంటివారు. వెనుకబడిన వర్గాలలో ఆయనకున్న బలమైన సామాజిక ముద్ర, యువతలో ఉన్న మాస్ క్రేజ్ పార్టీకి ఉన్న అతిపెద్ద ఆస్తి. ప్రత్యర్థులను ధీటుగా ఫేస్ చేయగల ఆయన అగ్రెసివ్‌నెస్‌తో పార్టీని ఒంటిచేత్తో నడిపించగల సత్తా ఆయనకు ఉంది. రాబోయే ఎన్నికల బరిలో ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇతర పార్టీల నాయకుల కోసం నిరీక్షిస్తూ సొంత కార్యకర్తలను నిరాశకు గురిచేయడం ఏ రాజకీయ పార్టీకైనా ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది.

# గుదిబండలా రాజోలిబండ



**మొదటిపేజీ తరువాయి**

ప్రయోజనం పొందుతున్నారు. ఈ భారీ నీటిపారుదల వ్యవస్థ ద్వారా కేవలం గద్వాల జిల్లాలోనే సుమారు 87,500 ఎకరాల విస్తీర్ణానికి సాగునీరు అందాల్సి ఉంది. నడిగడ్డ ప్రాంతానికి ఒక గొప్ప వరప్రదాయినిగా మారిన ఈ ఆర్డీఎస్ వ్యవస్థ ప్రస్తుత తరుణంలో ఆధునీకరణ పనులు మందగించడం, ప్రతిపాదిత రిజర్వాయర్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడం వల్ల ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతోంది. పరిపాలనాధికారులు, రాజకీయ పాలకుల నిస్సహాయత కారణంగా ఇక్కడి లక్షలాది ఎకరాల స్థిర ఆయకట్టు భవిష్యత్తులో ఎడారిగా మారే ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. పూర్వపు నిజాం పాలకులు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని తీవ్ర కరువు పీడిత ప్రాంతాలకు శాశ్వతంగా సాగునీరు అందించాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఆ తర్వాతి కాలంలో ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ప్రకారం ఎడమ వైపు కాలువ ద్వారా తెలంగాణ ప్రాంతానికి 15.9 టీఎంసీల నికర జలాలను కేటాయించడం జరిగింది. జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలో విస్తరించిన అలంపూర్, గద్వాల్ నియోజకవర్గాల్లోని 87,500 ఎకరాల భూములకు ముఖ్యంగా ఐజ, వడ్డేపల్లి, మానవపాడు, ఇటిక్యాల మండలాల్లోని 75 గ్రామాల ప్రజల సాగునీటి అవసరాలు తీర్చడమే దీని వెనుక ఉన్న అసలు లక్ష్యం. ఈ ప్రాజెక్టు ఆనకట్ట కర్నాటక పరిధిలోని రాయచూర్ జిల్లాలో ఉండటంతో ఈ ప్రధాన కాలువ మొదటి 42 కిలోమీటర్ల మేర కర్నాటక భూభాగంలోనే సాగుతుంది. నది ఎగువ భాగంలో ఉన్న కర్నాటక ప్రాంత రైతులు చట్టవిరుద్ధంగా వందలాది హైపవర్ మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తోడేస్తున్నారు. కాలువలకు పెద్ద ఎత్తున గండ్లు కొట్టడం వంటి చర్యల వల్ల తెలంగాణ సరిహద్దులోకి ఈ నీరు ప్రవేశించే సరికి అందులో సగం పరిమాణం మాత్రమే మిగులుతోంది. ఈ అక్రమాల వల్ల తెలంగాణకు చట్టబద్ధంగా దక్కాల్సిన 15.9 టీఎంసీల జలాలకు గాను ప్రస్తుత కాలంలో కేవలం 5 నుండి 6 టీఎంసీల నీరు మాత్రమే క్షేత్రస్థాయికి చేరుకుంటోంది. మరోవైపు కర్నూలు జిల్లా అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ముమ్మాటికీ చట్టవిరుద్ధమైనవని తెలంగాణ సమాజం గట్టిగా వాదిస్తోంది. ఇలాంటి అనేక రకాల అంతర్రాష్ట్ర వివాదాల కారణంగా కాలువ చిట్టచివరి భాగంలో ఉన్న అలంపూర్ ప్రాంత ఆయకట్టు భూములు దశాబ్దాలుగా సాగునీరు లేక బీడు వారిపోతున్నాయి. ఈ విధంగా ఆర్డీఎస్ కాలువ ద్వారా ఆశించిన మేర నీరు రాక ఎండిపోతున్న గద్వాల జిల్లా పరిధిలోని పాత ఆయకట్టును ఏ రకమైన ఆపద రాకుండా కాపాడుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. కృష్ణా నదికి సంబంధించిన బ్యాక్వాటర్ అంటే సుంకేసుల బ్యారేజీ ఎగువ భాగం నుండి జలాలను ఎత్తిపోతల ద్వారా ఆర్డీఎస్ కాలువకు మళ్లించే పనుల్లో మొదటి విడత లేదా స్టేజ్ 1 పనులను విజయవంతంగా పూర్తి చేశారు. దీనివల్ల స్థానిక ఆయకట్టు రైతులకు కొంతవరకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. గత కాలంలో ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునికీకరణ ప్రక్రియ కోసం, ప్రధాన ఆనకట్టపై ఎటువంటి గండ్లు పడకుండా కాంక్రీట్ గోడ ఎత్తును మరో 15 సెంటీమీటర్ల మేర పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం తన వాటా నిధులను కర్నాటక ప్రభుత్వ ఖాతాలో డిపాజిట్ చేసింది. ఆ తర్వాత తెలంగాణ భూభాగంలోకి ఈ ప్రధాన కాలువ ప్రవేశించిన అనంతరం అంటే 42 కిలోమీటర్ల తర్వాతి భాగంలో ఉన్న కాలువలకు కొంతమేర పేరుకుపోయిన సిల్ట్ అనగా మట్టిని తొలగించే పనులను, అంతర్గత లైనింగ్ పనులను పూర్తి చేయడం జరిగింది. కేవలం నది ప్రవాహం నుండి నీటిని నేరుగా లిఫ్ట్ చేయడం వల్ల కేవలం వరదలు వచ్చే రోజుల్లో మాత్రమే ఆయకట్టుకు నీరందించే వెసులుబాటు ఉంటుంది. సంవత్సరం పొడవునా రైతులకు నిరంతరాయంగా సాగునీరు అందించడానికి వీలుగా తుమ్మిళ్ల స్టేజ్ 2 పథకంలో భాగంగా ప్రతిపాదించిన మూడు కీలక రిజర్వాయర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కర్నాటక భూభాగంలో ఉన్న మొదటి 42 కిలోమీటర్ల మేర గల కాలువకు పూర్తిగా కాంక్రీట్ లైనింగ్ అనగా లింక్ ఛానల్ పనులను త్వరితగతిన చేపట్టాల్సి ఉంటుంది. అక్కడ స్థానిక రైతుల ద్వారా జరుగుతున్న చట్టవిరుద్ధ నీటి తోడివేతను సమర్థవంతంగా అడ్డుకోవడానికి కర్నాటక ప్రభుత్వంపై రాజకీయంగా ఒత్తిడి తీసుకురావాలి. అందుకోసం ఇరు రాష్ట్రాల సంయుక్త రక్షణ, ప్రత్యేక నిఘా వ్యవస్థను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న అక్రమ కాలువ పనులను అడ్డుకోవడంతో పాటు ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నియంత్రణ బాధ్యతలను పూర్తిగా కేఆర్ఎంబీ బోర్డు తన ఆధీనంలోకి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా డిమాండ్ చేస్తోంది. ఈ మొత్తం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్వహించబోయే పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా నిపుణులు చెబుతున్నారు. తుమ్మిళ్ల పథకం ద్వారా చివరి ఎకరాకు సైతం సాగునీటిని అందించే మహత్తర లక్ష్యంతో రాజోలి మండల పరిధిలో ఈ మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం అధికారికంగా ప్రతిపాదించింది. ఈ జలాశయం గనుక అనుకున్న సమయానికి పూర్తయితే నదిలో విపరీతంగా వరదలు ఉన్నప్పుడు అదనపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు వర్షపు నీటిని కూడా సంరక్షించుకునే అద్భుతమైన వెసులుబాటు కలుగుతుంది. ఈ మల్లమ్మ కుంట ద్వారా ఆర్డీఎస్ కాలువ చిట్టచివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరందించవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు మొదటి నుంచి గట్టిగా భావిస్తున్నారు. మొదటి విడత పనులు ముగిసిన సమయంలోనే ఈ మల్లమ్మ కుంట జలాశయ నిర్మాణాన్ని కూడా సమాంతరంగా చేపట్టి ఉంటే ఈపాటికి పనులన్నీ తుది దశకు చేరుకునేవి. నిధుల కొరత, పరిపాలనాపరమైన నిర్లక్ష్యం కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఈ రిజర్వాయర్ భవిష్యత్తు ప్రస్తుతం ఒక పెద్ద ప్రశ్నార్థకంగా రూపాంతరం చెందింది.

# కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఆగవు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రగతిపై తమకున్న అంకితభావాన్ని చాటుకుంటూ ఢిల్లీ వేదికగా మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఎవరి గుర్తింపు పత్రాలు లేదా ధృవీకరణలు అవసరం లేదని కిషన్ రెడ్డి చాలా స్పష్టమైన మాటల్లో తేల్చి చెప్పారు. కేంద్ర పాలకులుగా తాము ఎల్లప్పుడూ ప్రాంతీయ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర రవాణా రంగానికి తలమానికంగా నిలిచిన మెట్రో ప్రాజెక్టు రెండవ దశ విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును యాభై యాభై నిష్పత్తితో ఉమ్మడిగా ముందుకు తీసుకెళ్లాలనే ప్రాథమిక ఆలోచనకు తాము అంగీకారం తెలిపినట్లు ఆయన వివరించారు. తొలి దశ మెట్రో నిర్మాణ సమయాల్లో సైతం కేంద్రం తన వంతుగా 1250 కోట్ల రూపాయల భారీ ఆర్థిక సాయాన్ని అందించిందని ఆయన గుర్తు చేశారు. నిర్మాణ పనులన్నీ విజయవంతంగా పూర్తయిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ సేవలను ప్రారంభించారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో రెండు, మూడు దశల మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం ఏ విధంగానైతే తోడ్పాటు అందిస్తోందో అదే రీతిలో భాగ్యనగరానికి సైతం సాయం అందుతుందని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. సాంకేతిక పరంగా, ఆర్థిక పరంగా రాష్ట్ర ప్రభుత్వాలతో సుదీర్ఘంగా చర్చలు జరిపిన తర్వాతే తాము సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎవరో ఒకరు వద్దన్నంత మాత్రాన ప్రజా ఉపయోగకరమైన ప్రాజెక్టులు ఎక్కడా ఆగిపోవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎటువంటి ముందస్తు ఆలోచన లేకుండా, దుందుడుకు స్వభావంతో మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదని హితవు పలికారు. తాను కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరికి సమాధానం చెప్పాల్సిన వ్యక్తిని కాదని కిషన్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజానికి, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు మాత్రమే తాను ఎల్లప్పుడూ జవాబుదారీగా ఉంటానని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో గత 12 ఏండ్ల సుదీర్ఘ కాలంగా తాము ఈ గడ్డ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నామని, జాతీయ రహదారుల విస్తరణతో పాటు రైల్వేల ఆధునీకరణకు నిరంతరం నిధులు మంజూరు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు నిలిచిపోయేలా తానేదో కేంద్ర మంత్రులను కలిసి ఒప్పందాలు చేసుకున్నట్లు ముఖ్యమంత్రి ప్రచారం చేయడం హాస్యాస్పదమని కిషన్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ ప్రాంత ఉనికి కోసం, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష సాకారం కావడం కోసం తాను స్వయంగా సుదీర్ఘ పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. పార్లమెంటులోని రాజ్యసభ, లోక్‌సభలలో ప్రత్యేక తెలంగాణ బిల్లు ఆమోదం పొందాలనే ఏకైక లక్ష్యంతో నాడు తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగినట్లు పేర్కొన్నారు. చట్టసభల్లో రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లు పూర్తిగా పాసైన తర్వాతే తాను ఆ దీక్షను విరమించానని నాటి రోజులను స్మరించుకున్నారు. భాగ్యనగరంతో పాటు మొత్తం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సంబంధించి తమకు ఇతరులెవ్వరూ కొత్తగా పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. వరంగల్ పరిధిలో ఏర్పాటు కాబోతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం కేంద్ర ప్రభుత్వ చొరవతోనే సాధ్యపడుతోందని ఆయన చెప్పారు. ఇవే కాకుండా రవాణా రంగాన్ని మలుపు తిప్పేలా 175000 కోట్ల రూపాయల భారీ అంచనా వ్యయంతో జాతీయ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ నిధులన్నీ కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రం కేటాయించిందని ఆయన స్పష్టత ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 42 రైల్వే స్టేషన్లను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం భుజాన వేసుకుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రధాన రైల్వే టెర్మినల్స్ అయిన సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి వంటి కేంద్రాలను అద్భుతంగా మారుస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ఈ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని వివరించారు. వీటి ద్వారా భవిష్యత్తులో ప్రయాణ అవసరాలు మరింత సులభతరం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనుల కోసమే ప్రత్యేకంగా 720 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌ను కేటాయించినట్లు కిషన్ రెడ్డి లెక్కలతో సహా వివరించారు. అదే విధంగా చారిత్రాత్మక నాంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం 350 కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ కేవలం ఒకరిద్దరు నాయకులు కోరితేనో లేక ఒత్తిడి చేస్తేనో చేపట్టినవి కావని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ ప్రాంతంపై ఉన్న బాధ్యతాయుతమైన దృక్పథం వల్లే ఇవన్నీ సాకారమవుతున్నాయని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి ఒక్క సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమం వెనుక కేంద్ర ప్రభుత్వ నిధుల భాగస్వామ్యం ఖచ్చితంగా ఉందనే నిజాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు పక్కన పెట్టి వాస్తవాలను గ్రహించాలని ఆయన పాలక పక్షానికి సూచించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే అయినప్పటికీ అవి నిజాలకు విరుద్ధంగా ఉండకూడదని హితవు పలికారు. కేంద్రం ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర పురోభివృద్ధికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు. తెలంగాణ సమాజానికి ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ భవిష్యత్తులోనూ మరిన్ని మరిన్ని నిధులను తీసుకురావడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు.

# సింగరేణిని రక్షిస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఊపిరిగా నిలిచే సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు ఎలాంటి పోరాటానికైనా తాము సిద్ధమని బీఆర్ఎస్ ప్రముఖ నాయకురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గత కాలంలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు పడిన తరుణంలో ఉధృతమైన ఉద్యమాల ద్వారా అనేక బొగ్గు గనులను కాపాడుకున్న అనుభవం తమకు ఉందని ఆమె గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఢిల్లీ వేదికగా ఇటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు. ఈ చారిత్రాత్మక సంస్థను ప్రైవేట్ శక్తుల హస్తగతం కాకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని వివరిస్తూ కార్మికుల్లో కొండంత ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. తెలంగాణలోని గోదావరి లోయ ప్రాంతంలో విస్తరించి ఉన్న విలువైన బొగ్గు నిల్వలను కేవలం సింగరేణి సంస్థకే కేటాయించాలంటూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డికి ఆమె విజ్ఞప్తి చేశారు. నూతన కోల్ బ్లాకుల వేలం ప్రక్రియలో ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడే దుస్థితి ఈ ప్రభుత్వ రంగానికి కల్పించవద్దని డిమాండ్ చేశారు. మన ప్రాంతంలో ఉన్న వనరులను మన సంస్థకే దక్కేలా చూస్తూ అత్యధిక బ్లాకులను కేటాయించేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ చారిత్రాత్మక సంస్థ మనుగడ సాగించాలంటే ప్రభుత్వ మద్దతు ఎంతో అవసరమని పేర్కొంటూ విధానపరమైన నిర్ణయాలలో మార్పులు తీసుకురావాలని ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుత యాజమాన్యం లాభాల వేటలో పడి సాంప్రదాయ భూగర్భ గనులను క్రమంగా మూసివేస్తూ పర్యావరణానికి నష్టం కలిగించే ఓపెన్ కాస్ట్ మైన్లను విపరీతంగా పెంచుతోందని ఆరోపించారు. ఈ విధమైన చర్యలు పరోక్షంగా ప్రైవేటీకరణకు దారితీస్తాయని దీనివల్ల వేలాది మంది కార్మికుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలోని అండర్ గ్రౌండ్ మైన్లను యథావిధిగా కొనసాగిస్తూ అక్కడ పనిచేసే మానవ వనరుల సంఖ్యను భారీగా పెంచాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. కార్మికుల ప్రాథమిక హక్కులను కనీస అవసరాలను సైతం పట్టించుకోకుండా యాజమాన్యం సర్కారు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే నల్ల సూర్యులకు కనీస రక్షణ కరువైందని గనుల లోపల సరైన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. గనుల్లో శ్రమిస్తున్న వేలాది మంది శ్రామికులకు సురక్షితమైన తాగునీరు కూడా అందించలేని దౌర్భాగ్య స్థితిలో యాజమాన్యం ఉందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా చూస్తే ఆధునిక గనుల్లో కార్మికుల రక్షణ కొరకు గాలి ప్రసరణ కొరకు అత్యంత విప్లవాత్మకమైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. దురదృష్టవశాత్తు సింగరేణి పరిధిలో మాత్రం శతాబ్దాల నాటి కాలం చెల్లిన పాత పద్ధతులనే నేటికీ అవలంబిస్తూ కార్మికుల ప్రాణాలతో మూటా ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి పొరల్లోకి వెళ్లే కార్మికులకు ఊపిరి పీల్చుకోవడానికి తగినంత ఆక్సిజన్ సరఫరా చేయలేని స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం సంస్థ నిర్వాహకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. శ్రామిక శక్తుల శ్రమతో కోట్లాది రూపాయల లాభాలు గడిస్తున్న పాలకులు వారి సంక్షేమాన్ని విస్మరించడం సిగ్గుచేటని కవిత దుయ్యబట్టారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్కే 7 భూగర్భ గని వద్ద ఆమె తలపెట్టిన బొగ్గుబాయి అనే వినూత్న కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ శ్రేణులు కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు గని ప్రవేశ ద్వారం వద్దే అడ్డుకోవడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ భారీ గేట్లను తోసుకుంటూ కవిత తన అనుచరులతో కలిసి గని ప్రాంగణంలోకి దూసుకెళ్లడంతో అక్కడ స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. గనుల్లో పనిచేసే కార్మికులతో ముఖాముఖి మాట్లాడేందుకు గేట్ మీటింగ్ నిర్వహించుకునే హక్కు తమకు రాజ్యాంగబద్ధంగా ఉందో లేదో చెప్పాలని నిలదీశారు. గతంలో అడవుల్లో ఉండే అన్నల పేరు చెప్పి కార్మికులను భయభ్రాంతులకు గురిచేసిన యాజమాన్యం ఇప్పుడు వారు లేకపోయినా వేధింపులు ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పక్షాన నిలబడే అటువంటి పోరాట శక్తులు తమ రాజకీయ పార్టీలో ఉన్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కష్టజీవులైన సింగరేణి శ్రామికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా వారి హక్కులకు భంగం వాటిల్లినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని గట్టిగా హెచ్చరించారు. కార్మికుల సంక్షేమం కొరకు సంస్థ పరిరక్షణ కొరకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని అవసరమైతే ఈ అంశంపై న్యాయపరమైన పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు 100 కు పైగా ఉన్న అండర్ గ్రౌండ్ గనులను ప్రస్తుతం కేవలం 20 నుండి 25 లోపుకు పడిపోయేలా చేయడం వెనుక ఉన్న కుట్రలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. సంస్థ భవిష్యత్తును 50 ఏళ్ల పాటు పదిలంగా ఉంచేందుకు తమ వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ మైనింగ్ రంగంలో సుమారు 40000 మందికి పైగా శాశ్వత కార్మికులు వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ జీవితాలను ధారపోస్తున్నారని గణాంకాలతో వివరించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 70 మిలియన్ టన్నుల మార్కుకు చేర్చాలని చూస్తున్న పాలకులు వారి రక్షణ బడ్జెట్ లో కేవలం 5 శాతం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. గనుల ఆధునీకరణ కొరకు 1000 కోట్ల రూపాయల నిధులు తక్షణమే విడుదల చేయాలని అప్పుడే కార్మికులకు భద్రత చేకూరుతుందని డిమాండ్ చేశారు. కార్మిక లోకానికి అండగా నిలుస్తూ సింగరేణి అస్తిత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కలిసిరావాలని ఆమె గట్టిగా పిలుపునిచ్చారు. సమర్థవంతమైన నాయకత్వంతో బొగ్గు గనుల రక్షణకు పూనుకోవడం ద్వారా మాత్రమే తెలంగాణ గడ్డపై కార్మిక శక్తిని బలోపేతం చేయగలం అని కవిత పునరుద్ఘాటించారు. సింగరేణిని ఒక లాభాపేక్ష కలిగిన వ్యాపార సంస్థగా మాత్రమే చూడకుండా లక్షలాది మంది కుటుంబాలకు ఆశ్రయం కల్పించే ఒక జీవనాధారంగా భావించాలని హితవు పలికారు. ప్రభుత్వాలు మారినా సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం కార్మికుల సంక్షేమం మాత్రమే అయి ఉండాలని ఆమె నొక్కి చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆమె చేసిన వ్యాఖ్యలు కార్మిక వర్గంలో కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.

# కలెక్టరమ్మా.. మా గోడు పట్టించుకోండి..!

- కురవి జడ్పీహెచ్ఎస్‌లో బాలికల దుస్థితి
- తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలతో విద్యార్థుల అవస్థలు.
- తాగునీరు లేక విద్యార్థుల అవస్థలు
- మరుగుదొడ్లకు తలుపులు లేక బాలికల ఇబ్బందులు
- ఎదురెదురుగా బాలురు, బాలికల టాయిలెట్లు
- ఆత్మగౌరవం దెబ్బతింటోందని విద్యార్థినుల ఆవేదన
- వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తుల విజ్ఞప్తి




**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన కురవి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లో చదువుతున్న విద్యార్థినుల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు జిల్లాకు ఎంతోమంది మేధావులను, ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను అందించిన ఈ పాఠశాల ప్రస్తుతం కనీస మౌలిక సదుపాయాల కొరతతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలకు సరైన మరుగుదొడ్లు లేకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ఉన్న టాయిలెట్లకు తలుపులు సరిగా లేకపోవడంతో పాటు బాలురు, బాలికల మరుగుదొడ్లు ఎదురెదురుగా ఉండటం వల్ల బాలికలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. గౌరవప్రదంగా, భద్రతతో కూడిన వాతావరణంలో విద్యను అభ్యసించాల్సిన బాలికలు ప్రతిరోజూ ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొనడం బాధాకరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా పాఠశాలలో తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన బోరుబావి ప్రస్తుతం ఉపయోగంలో లేకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. బోరుబావికి మోటారు అమర్చితే వందలాది మంది విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తల్లిదండ్రులు సూచిస్తున్నారు. ప్రభుత్వాలు దేవాలయాల అభివృద్ధికి, ఇతర నిర్మాణాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపడం విచారకరమని స్థానికులు విమర్శిస్తున్నారు. మౌలిక సదుపాయాల లేమి కారణంగా కొందరు బాలికలు చదువు మధ్యలోనే మానివేసే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కురవి జడ్పీహెచ్ఎస్‌లో తాగునీటి సౌకర్యం, ప్రత్యేక మరుగుదొడ్లు, టాయిలెట్ల మరమ్మతులు, భద్రతా చర్యలు చేపట్టి బాలికల ఆత్మగౌరవాన్ని కాపాడాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మనసున్న దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. "చదువుకునే పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కురవి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల గోడును అధికారులు వెంటనే పట్టించుకుని చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్ట్



**ఆర్మూర్, విశాల భారతి:** హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నందిపేట్ ఎస్ ఐ కే .వినయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం నందిపేట్ మండల కేంద్రంలో క్యారం బోర్డ్ దుకాణం వద్ద నయీంపై హత్యాయత్నం చేశారు. పెయింటింగ్ సంబంధించిన బాకీ డబ్బుల విషయంలో గొడవ జరిగింది ఇందులో ప్రధానంగా నందిపేట్ కు చెందిన షేక్ తహేర్, షేక్ గాలిబ్, ముగ్గురు అన్నదమ్ములు కామారెడ్డికి చెందిన సయ్యద్ అబ్దుల్ కలీం, ఎస్కే పజిల్ మంగళవారం వేల్మల్ పెట్రోల్ బంక్ ఎదురుగా వెహికల్ చెక్ చేస్తుండగా పట్టుకొని వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన నాలుగు ఇనుప రాడ్లు, ఒక కత్తి మరియు రెండు ద్విచక్ర వాహనాలు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## రూ.31.78 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభం



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలంలోని షారాజిపేట గ్రామంలో అడ్లూరు చెరువు అలుగు మరమ్మతు పనులను గ్రామ సర్పంచ్ కంతి మధు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో రూ.47.50 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు షెడ్యూల్ కులాల కేటగిరి రిజర్వేషన్ కింద రూ.31,78,014 నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఈ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. చెరువు అలుగు మరమ్మతులతో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడి రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులు బండ శ్రీను, కంతి భిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుకు నాగరాజు, మదర్ డైరీ డైరెక్టర్ బత్తుల నరేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ కిష్టయ్య, పార్టీ నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, స్వామి, ప్రభాకర్, శ్రీశైలం, శ్రీనివాస్, యువ నాయకులు సంతోష్, శ్రీను, మధు, అనిల్, గణేష్, నర్సింగ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో పాడి ఆవు మృతి

**రైతుకు తీరని ఆర్థిక నష్టం**



**మోటకొండూరు, విశాలభారతి:** మండల పరిధిలోని చామపూర్ గ్రామంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో ఓ పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు యెల్లంల శ్రీధర్ రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టివేయగా ఈ ఘటన జరిగింది. రోజువారీ మాదిరిగానే ఆవును బావి సమీపంలో కట్టివేయగా, అక్కడ విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృత్యువాత పడింది. చేతికొచ్చిన పాడి ఆవు కళ్లెదుటే మృతి చెందడంతో రైతు శ్రీధర్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాడి ఆవును కోల్పోవడం వల్ల తనకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు మరియు ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ బాధిత రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

## పుస్తకాలు పంపిణీ చేసిన గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్



**నిజామాబాద్, విశాల భారతి:** మాక్లూర్ మండలంలోని గుంజిలి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంజలి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గ్రామ శ్రీనివాస్ చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు..అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ హెడ్మాస్టర్ కొత్త అడ్మిషన్ గురించి అడిగి తెలుసుకోవడం జరిగినది. అడ్మిషన్స్ ఎక్కువ రావడంతో హెడ్మాస్టర్ అభినందించారు. పాఠశాలలో సమస్యలు ఉంటే వెంటనే చెప్పాలని పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చెప్పారు. విద్యార్థులను మంచిగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అలాగే తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ,మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి పాఠశాలలో వసతుల కల్పనకై తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి ఆకు పూజ



**యాదగిరిగుట్ట, విశాలభారతి:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో మంగళవారం క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు పుష్కరిణి ఆవరణలో గల ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు మన్యు సూక్త పారాయణముతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించిన స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఆకు పూజలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనియున్నారు.

## పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం హుస్నేనాబాద్ కేజీబీవీ, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాగాయత్)లను పరిశీలించారు. కొత్త అడ్మిషన్లు, విద్యార్థుల హాజరు, బోధన విధానం, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. మరమ్మతు, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 12 ఏళ్ల బీజేపీ పాలన కార్పొరేట్లకే లాభం ప్రజలపై భారమే

**కల్లూరి మల్లేశం**

**ఆలేరు, విశాలభారతి:**



12 ఏళ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీలు, పన్ను రాయితీలు ఇచ్చి వారికి పండుగ చేసిన కేంద్ర ప్రభుత్వం, సామాన్య ప్రజలపై జీఎస్టీ ఇతర పరోక్ష పన్నుల రూపంలో రూ.24 లక్షల కోట్ల భారం మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో "12 ఏండ్ల బీజేపీ పాలన - పరిశీలన" అంశంపై నిర్వహించిన సెమినార్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రతి పౌరుడి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. నోట్ల రద్దు నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశారని, కరోనా సమయంలో సరైన ప్రణాళికలు లేకపోవడం వల్ల లక్షలాది మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక సంఘాల స్వేచ్ఛను ప్రశ్నార్థకం చేశారని, రైతుల వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించారని అన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతూ నీట్, యూజీసీనెట్ తదితర పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం దేశానికి అవమానకరమని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు దేశ అప్పు రూ.55 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం అది రూ.200 లక్షల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి వెయ్యి రూపాయలు దాటిందని, పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయని, ప్రజలపై భారాలు పెంచుతూ కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఎల్ఐసీ, రైల్వేలు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా దేశ సంపదను పెద్ద పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలకు మౌలిక వసతులు, ఆర్థిక భద్రత పెరగకపోయినా లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు, సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఎ. ఇక్బాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్, సీపీఎం పట్టణ నాయకులు వద్దేమాన్ బాలరాజు, గనగాని మల్లేష్, తాళ్లపల్లి గణేష్, సంఘీ రాజు, మొరిగాడి అజయ్, చౌడబోయిన అంజయ్య, మిట్ట శంకరయ్య, చెన్న రాజేష్, కటకం సుదర్శన్, కొరుటూరు ఉపేందర్, గౌడుగు దాసు, రేగోటి ప్రశాంత్, మహిళా సంఘం నాయకులు మొరిగాడి స్వరూప, ఐలీ చంద్రకళ, గనగాని భాగ్యమ్మ, మొరిగాడి అనిత, మొరిగాడి మంజుల, ఐలీ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మొహరం వేడుకలకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలి

- పీరీల కొట్టం పరిసరాలను వెంటనే శుభ్రపరచాలని అధికారులకు విజ్ఞప్తి.
- షేక్ ఖాదర్ బాబా



**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే మొహరం (పీర్ల పండుగ) వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు, ముస్లిం మత పెద్దలు, యువకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. గ్రామంలోని పీరీల కొట్టం వద్ద భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రార్థనలు నిర్వహించే పరిస్థితి ఉండటంతో ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం పీరీల కొట్టం సమీపంలో ఉన్న ప్రైవేటు స్థలంలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగిపోవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి ఉందని స్థానికులు తెలిపారు. దీంతో విషసర్పాలు, విషపురుగులు సంచరించే ప్రమాదం నెలకొని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మొహరం ఉత్సవాల సందర్భంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, మొహరం పండుగ ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన వేడుక అని అన్నారు. ఈ పండుగను భక్తులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పీరీల కొట్టం పరిసర ప్రాంతాలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి, ముళ్ల పొదలు తొలగించి, చెత్తాచెదారాన్ని తరలించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ శుభ్రత, రహదారి మరమ్మతులు వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు. రాత్రి వేళల్లో జరిగే కార్యక్రమాల దృష్ట్యా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలు కూడా చేపట్టాలని సూచించారు. మొహరం ఉత్సవాలకు సమీప గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని షేక్ ఖాదర్ బాబా కోరారు. పండుగ నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భక్తులందరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## ప్రజల్లో గంజాయిపై అవగాహన



**నర్సింహులపేట,విశాల భారతి:** గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నర్సింహులపేట పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక ఎస్ఐ బానోతు వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆటో స్టాండ్, పెట్రోల్ బంక్, టీ స్టాళ్లు, ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం కేంద్రాలు, మీ సేవా కేంద్రం, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్, ఎంఆర్వో కార్యాలయం తదితర ప్రజా రద్దీ ప్రాంతాల్లో గంజాయి వ్యతిరేక పోస్టర్లను ప్రదర్శించారు. గంజాయి వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోస్టర్ల ద్వారా ప్రజలకు సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసు శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించి మాదక ద్రవ్యాల నిర్మూలనకు తోడ్పడాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు, ఇంటి స్థలం ఇచ్చి తీరుతా

**ఎమ్మెల్యే పాయం హామీ**



**పినపాక, విశాలభారతి :** మండలంలోని పోట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లా పురం గ్రామస్థులు తమ సమస్యలు పై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను కలిశారు. గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా మారిన పెద్ద వాగు పక్కన ఉంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, ఏ క్షణంలో ఏ ప్రమాదం వస్తుందో తెలియక ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని మొర పెట్టుకున్నారు. వారి సమస్యలు, పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ఎల్లాపురం గ్రామస్థులను అక్కడి నుంచి ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం తో గ్రామస్థులు ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు గొగ్గల రామకృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి హోమంతో పాఠశాల పున: ప్రారంభం



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం (2026 27) ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు మంచి చదువుతో పాటు చక్కని సంస్కారం అంది భవిష్యత్తు లో గొప్ప స్థాయికి ఎదగాలని ఆ సరస్వతీ దేవి, లక్ష్మీ దేవి ల కటాక్షం ఆశీస్సులు ఎల్లప్పుడూ విద్యార్థులపై ఉండాలని గాయత్రి హోమ యజ్ఞాన్ని నిర్వహించారు.పాఠశాల ప్రభందకారిణి సభ్యులు,పోషకులు శ్రీమతి గట్ల శైలజ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులకు మంచి విద్యా బుద్ధులు అలవడాలని ప్రతి సంవత్సరం సరస్వతీ శిశు మందిరాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా గాయత్రి యజ్ఞాన్ని నిర్వహిస్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు సంతోష్ కుమార్,ఆచార్యులు ఉషారాణి,భారతి,సుజాత,మంజుల,కవిత,సిందుజ మరియు పోషకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## చాకలి ఎస్సీ సాధన సమితి వాల్ పోస్టర్ ఆవిష్కరనా

**విశాల భారతి గూడూరు:** గూడూరు మండల కేంద్రంలో చాకలి ఎస్సీ సాధన సమితి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఎస్సీ సాధన సమితి 9వ వార్షికోత్సవ మహాసభ చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి చాకలి మాట్లాడుతూ చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.2016లో అసెంబ్లీ సమావేశాల్లో నేటి ముఖ్యమంత్రి ప్రతిపక్ష హోదాలో చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేసి నేడు అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ సైతం చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు.చాకలి కులస్తులకు ఉచిత కరెంటు పథకం కొనసాగిస్తూ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చాకలి వృత్తిదారులు దోబీ పోస్టులు దోబిళ్ళకి కేటాయించాలని కాంట్రాక్టును దోబిళ్ళకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాకలి వృత్తిదారులను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి ఏదునూరి వెంకన్న, మండల శాఖ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, మడిపెద్ది శ్రీనివాస్, రాసమల్ల రాములు, రాసమల్ల వెంకన్న, తంగళ్ళపల్లి సునీల్, సురేష్, బుచ్చి రాములు, సిరికొండ సాయిలు, రాసమల్ల యాదగిరి, మడిపెద్ది భాస్కర్ పాల్గొన్నారు.



## నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా అదనపు కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** నూతనంగా బదిలీపై జిల్లాకు విచ్చేసి, పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వి.భుజంగరావు ని మరియు జిల్లా రెవెన్యూ అధికారిని బి.గీతను ఐడిఒసి కార్యాలయం నందు వారి ఛాంబర్లలో టీఎన్జీవోస్ పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి ,పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి సాదరంగా ఆహ్వానించి, అనంతరం జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించిన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ వీరితోపాటు టిఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, అర్బన్ యూనిట్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, రూరల్ యూనిట్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్, స్వామి,సాయికృష్ణ, విజయ్, రాకేష్ తదితరులు హాజరైనారు.

## మంచినీటి భావాలను

- **శుభ్రంగా ఉంచుకోవాలి.. బావికి మురామ్మతుల పనులను ప్రారంభిస్తున్న అభినవ్ రెడ్డి**



**మరిపెడ విశాల భారతి:** గ్రామంలోని మంచినీటి బావులను శుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని కాంగ్రెస్ పార్టీ యువ నేత నూకల అభినవరెడ్డి అన్నారు. మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామంలో మంచినీటి బావి మరమ్మతుల కోసం ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం సీజన్ లో తాగునీరు ఎలాంటి కలుషితం కాకుండా స్థానిక సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బంది తెగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెన్నెల నాగరాజు, ఉప సర్పంచ్ దేశెట్టి శ్రీనివాస్, పటేల్ దుర్గయ్య, రాజీల్క శ్రీనివాస్ చారి, మల్యాల శ్యాం, దండగల వెంకన్న, వంగూరి వెంకన్న,రాజీల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బంధు యాకయ్య



**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన బంధు యాకయ్య తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు లావుడియా రాములు నాయక్ ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల బలోపేతానికి కృషి చేసే లక్ష్యంతో బంధు యాకయ్యను రాష్ట్ర కమిటీలోకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయన పదవీకాలం ఐదేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బంధు యాకయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.బంధు యాకయ్య రాష్ట్ర స్థాయి పదవికి ఎన్నిక కావడం పట్ల రాంపురం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మెండి భాస్కర్ వినతి

- **అసంపూర్తి బీటీ రోడ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**
- **ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని వినతి**



**బూర్గంపాడు /విశాలభారతి:** బూర్గంపాడు మండలం వేపలగడ్డ గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు ఆదివాసీల బూర్గంపాడు మండల నాయకుడు మెండి భాస్కర్ తెలిపారు. అదేవిధంగా గత 3 సంవత్సరాలుగా బిటి రోడ్ రహదారి నిర్మాణం పూర్తికాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. మిడ్ మిక్స్ పోసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకొని 2 కోట్ల వ్యయంతో కూడిన బోర్డు నిర్మించి పరారైనట్లు ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్ నిర్మాణం పై దృష్టిసారించి సమగ్ర విచారణ జరిపించి రోడ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంబంధిత కాంట్రాక్టర్ ను తొలగించి వేపలగడ్డ గ్రామపంచాయతీ బీటీ రోడ్ నిర్మాణా పనులకు సహాయం చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు మెండిభాస్కర్ తెలిపారు.

## కోతులు,కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోండి

**మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్**




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని పాఠశాలల సమీపంలో కోతుల బెడద ఎక్కువగా ఉందన్న సమాచారంతో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి,పాఠశాలల పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించి,పరిస్థితిని సమీక్షించ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవలే నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు పాఠశాలలకు వస్తున్న నేపథ్యంలో వారి భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ పేర్కొన్నారు.పాఠశాల ఆవరణలోగానీ,పరిసర ప్రాంతాలలోగానీ కోతులు, కుక్కల బెడద లేకుండా తక్షణమే తగు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అక్కడికక్కడే అధికారులను,సిబ్బందిని ఆదేశించడం జరిగింది.మున్సిపల్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలి.పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, పిచ్చిమొక్కలను తొలగించాలి. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని,అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఆన్ ఏఐ, డిజిటల్ లెర్నింగ్" కార్యక్రమం ప్రారంభం




**పాల్వంచ విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలోని డా. బి.ఆర్. అంబేద్కర్ సెమినార్ హాల్‌లో మంగళవారం "అన్నఅక్క మెంటార్‌షిప్" కార్యక్రమానికి అనుబంధంగా "టీచింగ్ ఇంటర్న్‌షిప్ ఆన్ ఏఐ & డిజిటల్ లెర్నింగ్" శిక్షణా కార్యక్రమం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. మాధవి అధ్యక్షతన ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జూన్ 16 మరియు 17 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ ఐదవ సెమిస్టర్‌లో భాగంగా మూడవ సంవత్సరం విద్యార్థులకు ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా డాక్టర్ ఎస్.కె. నియాజ్ పర్వీన్ (భౌతిక శాస్త్ర విభాగం), పొట్లపువ్వు శ్రీనివాసరావు (గణిత శాస్త్ర విభాగం), కోటగిరి రాంబాబు (వాణిజ్య శాస్త్ర విభాగం) వ్యవహరిస్తున్నారు. శిక్షణ కార్యక్రమంలో కె.ఎల్.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల, పాల్వంచకు చెందిన లెక్చరర్ జి. ప్రియాంక విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, విద్యా రంగంలో ఏఐ అనువర్తనాలు తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని తమ విద్యా, వృత్తి జీవితాల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. మాధవి సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి. కొండలరావు, డాక్టర్ కామేశ్వరరావు, డి. రమేష్, డాక్టర్ టి. అరుణకుమారి, పారెల్లి శ్రీనివాస్, డాక్టర్ ఎన్. శ్రీదేవి, దీపిక, వకుళ, బుద్దె రమేష్, బాబ్జీ, డి. రాజ్‌కుమార్, ఇ. శ్రీను, తదితర బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి

- **ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయాలి**
- **గంజ్ కమాన్ వద్ద కల్వర్టు పని ఆలస్యం పై ఎమ్మెల్యే అసహనం**
- **34వ డివిజన్లో పలు కాలనీలను సందర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్**





**నిజామాబాద్ జిల్లా విశాల భారతి ఇందూరు:** నగరవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. నిరంతరం శానిటేషన్ పనులు కొనసాగించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 34 వ డివిజన్ లో గల మిర్చి కాంపౌండ్, మార్వాడి గల్లీ, ఓల్డ్ రమేష్ టాకీస్ రోడ్డు తదితర కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నప్పుడు మాత్రమే కాకుండా.. నిరంతరం డ్రైనేజీ పరిశుభ్రత, మంచినీటి సరఫరా, వీధి దీపాల పనులను పర్యవేక్షించాలని తెలిపారు. అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పలు గల్లీలో మంచినీటి పైప్లైన్ లీకేజీలు గమనించి, వాటిని అరికట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా ...సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. నిత్యం పర్యవేక్షణ చేస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

**గంజ్ కమాన్ వద్ద కల్వర్టు**

గాంధీ గంజ్ కమాన్ వద్ద కల్వర్టు పూర్తైన నేపథ్యంలో తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సంబంధిత కాంట్రాక్టర్ కల్వర్టు మాత్రమే నిర్మించి వెళ్లిపోయారని అసహనం వ్యక్తం చేశారు. కల్వర్టు ఎత్తుగా నిర్మించినందునా..రోడ్డుకు సమాంతరంగా చేసి వెళ్ళే బాధ్యత వారిది కాదా అని ప్రశ్నించారు. వీలైనంత తొందరగా వాహన రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి రమేష్, స్థానిక కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్, బీజేపీ నాయకులు పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

## ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) సమస్యపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం



- **కలెక్టర్‌తో వెంటనే మాట్లాడిన మంత్రి**
- **గ్రామాల ప్రజల ఆందోళనకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) ఏర్పాటును వ్యతిరేకిస్తూ మంగళవారం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ప్రజాప్రతినిధులు పబ్బతి బాలకిషన్ గౌడ్, పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య,ఇట్టాముని గీత మహేష్, రాఘవ రెడ్డి కొత్త ప్రభాకర్ గౌడ్ తోపాటు కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. డంపింగ్ యార్డ్ కారణంగా పరిసర గ్రామాల ప్రజలకు ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యపై సమగ్ర నివేదిక తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం, గ్రామాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) ప్రతిపాదనను పునఃసమీక్షించాలని ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న రవీర్యాల సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్,పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి-దానయ్య, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టముని గీత-మహేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్,పిల్లాయిపల్లి ఉప సర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, కవాడి శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం ధర్మారెడ్డి, కొత్త అరుణ్ గౌడ్, మోలుగు అర్జున్, నారెడ్డి సతీష్‌రెడ్డి, నెమురగోముల మహేష్, పల్లపు సురేష్, గడ్డం ప్రవీణ్ గౌడ్, గండికోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, విశాలభారతి :** ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కామన్ డైట్ మెనూను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యతతో, పరిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. డిచ్పల్లి మండలం సుద్దపల్లి లోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్ లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. పుస్తకాలు, నోట్ బుక్కులు పూర్తి స్థాయిలో వచ్చాయా అని ఆరా తీశారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్ లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు వస్తేనే వారితో పంపాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు పాఠశాలకు హాజరు కాని విద్యార్థినుల పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు ఎందుకు పాఠశాలకు రావడం లేదనే విషయాన్ని ఆరా తీయాలన్నారు. పాఠశాలలో పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం సెకండియర్ క్లాస్ రూమ్ కు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేస్తూ, సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందజేశారు. చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి ప్రిన్సిపాల్ స్వప్న, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## నిరుపేద, అనాథ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

- **10 ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం**
- **సామాజిక కార్యకర్త కర్నె రవి పిలుపు**



**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యా పథకం కింద చదువుకుంటున్న విద్యార్థులలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారి స్థానంలో కొత్త విద్యార్థుల చేరికకు అవకాశం కల్పిస్తున్నట్లు సామాజిక కార్యకర్త కర్నె రవి తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 10 ఉచిత సీట్ల భర్తీకి అర్హులైన నిరుపేద, అనాథ మరియు వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం 79 మంది విద్యార్థులు ఈ ఉచిత విద్యా పథకం ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి పూర్తి చేసి బయటకు వెళ్లే విద్యార్థుల స్థానాల్లో కొత్త అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసే విధానం అమలులో ఉందన్నారు.

**అత్యంత నిరుపేద**

**కుటుంబాలకు చెందిన విద్యార్థులు,**

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, ఒంటరి తల్లి లేదా తండ్రి సంరక్షణలో ఉన్న విద్యార్థులు దివ్యాంగుల పిల్లలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లిఖిత పూర్వక దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి మణుగూరు మండల విద్యాశాఖాధికారి (ఎం ఈ ఓ) కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత, ఆర్థిక పరిస్థితి మరియు నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తారు అని తెలియజేసారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క బాలుడు లేదా బాలిక కూడా విద్యకు దూరం కాకూడదు. ప్రైవేట్ పాఠశాలల్లో లభించే ఈ ఉచిత విద్యా అవకాశం పేద విద్యార్థుల జీవితాలను మార్చగలదు. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, అత్యంత నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో చదువుకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో విద్య కొనసాగించలేని పిల్లలు ఉంటే, వారికి ఈ సమాచారం చేరవేసి ఏం. ఈ. ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా సహాయం చేయండి. సమాజంలో ప్రతి చిన్నారికి విద్య అందించడం మనందరి బాధ్యత అని కర్నె రవి పేర్కొన్నారు.

## డొమెస్టిక్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- **ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో ధర్నా హాజరై మాట్లాడిన ఎంపీ ఆర్ కృష్ణయ్య**




**ముషీరాబాద్,విశాల భారతి:** ఇండ్లలో పని చేసుకుంటున్న డొమెస్టిక్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్లో తెలంగాణ డొమెస్టిక్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో జోసెఫ్ లిస్సి అధ్యక్షతన మహా ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో కలిసి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. డొమెస్టిక్ వర్కర్లను అసంఘటిత రంగ కార్మికులు గా గుర్తించి కార్మిక చట్టాలను వర్తింప చేయాలని కోరారు. బతుకుతెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చిన వేలాదిమంది ప్రజలు ఇండ్లలో పనిచేసుకుంటూ వాచ్మెన్ గా కొనసాగుతున్నారని వారికి సొంత ఇల్లులు లేవని ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా వారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ చైర్మన్ నీల వెంకటేష్, నవనీత, అల్లోసప్, నిర్మల, పాలియా తదితరులు పాల్గొన్నారు.

## మీ సురక్ష యాప్ డౌన్ లోడ్ చేసుకోండి

- **నేరాల నియంత్రణకు తోడ్పడండి**



**కీసర,విశాల భారతి :** కీసర ఎన్ ఎన్ ఆర్ కాలనిలో దొంగతనాలు,నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన కీసర పోలీసులు.ఈ సందర్భంగా కీసర ఏ ఎస్ ఐ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో తరుచు ఇంట్లో పని చేసే వారితో దొంగతనాలు జరుగుతున్నాయి.కాబట్టి మల్కాజిగిరి కమీషనర్ సుమతి ఆదేశాల మేరకు మీ సురక్ష యాప్ యువర్ సేఫ్టీ అవర్ ప్రయారిటీ అనే మంచి ఆలోచనలతో కొత్త యాప్ ప్రారంభించడం జరిగింది.ప్రతి ఒక్కరు మీ మొబైల్ ఫోన్ లో మీ సురక్ష యాప్ డౌన్ లోడ్ చేసుకొని మీ వివరాలు మీ ఇంట్లో పని చేసే వారి వివరాలు ఎంట్రీ చేయాలి అట్టి డేటా మొత్తం మీ సురక్ష యాప్ లో అప్ లోడ్ అవుతాయి.ఇలాంటప్పుడు నేరాలు జరిగిన వెంటనే నేరస్థులను పట్టుకోవడానికి సులభంగా ఉంటుంది అని తెలిపారు.అనంతరం కాలానికి వచ్చిన ఏ ఎస్ ఐ వెంకటేశ్వర్ కి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ కుమార్ రెడ్డి శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నల్ల కృష్ణ రెడ్డి తోపాటు కాలనీ వాసులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు. కీసర ఎన్ ఎన్ ఆర్ కాలనిలో మీ సురక్ష యాప్ పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు.

## బంగారం బ్యాగ్ దొరికింది

**థాంక్యూ జాన్**




**మల్కాజిగిరి, విశాలభారతి:** ట్రైన్ దిగే సమయంలో మరచిపోయిన బంగారం ఉన్న బ్యాగును నిజాయితీగా తిరిగిచ్చిన వ్యక్తిని పోలీసులు అభినందించారు. ఈ ఘటన మల్కాజిగిరి పోలిస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా, జవహర్ నగర్ పోలిస్టేషన్ పరిధిలో నివసించే సంగం సూరిబాబు అనే వ్యక్తి మంగళవారం వైజాగ్ నుండి వస్తూ ఉదయం ఏడు గంటల ప్రాంతంలో మల్కాజిగిరి రైల్వే స్టేషన్ లో ట్రైన్ దిగాడు. తొందరలో బంగారం ఉన్న బ్యాగును స్టేషన్ లో మరచిపోయాడు. కొంతసేపటికి గుర్తురావడంతొ స్టేషన్ లో వెతికాడు. ఎంతకీ దొరకకపోవడంతో డయల్ 100 కి కాల్ చేసి కంప్లైంట్ చేశాడు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి క్రైం పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆటో డ్రైవర్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. జాన్ ఆటో డ్రైవర్ బంగారం ఉన్న బ్యాగును సేఫ్టీగా ఉంచి, బాధితులు వస్తే ఇద్దామని, లేకపోతే పోలీసులకు అప్పజేబుదామనుకున్నాడు. అప్పటికే పోలీసులు రావడంతో నిజాయితీగా 16 తులాల బంగారం ఉన్న బ్యాగును అప్పగించాడు. దానితో మల్కాజిగిరి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ జాన్ ను అభినందించారు..

## కాలనీ సమస్యల అడిగి తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే



**మల్లాపూర్, విశాలభారతి :** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి కాలనీవాసుల సమస్యల అడిగి తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గొల్లూరి అంజయ్య. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే డ్రైనేజీ, విద్యుత్ కి సంబందించిన మరియు ఇతర స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు సమన్వయం చేసి, వెంటనే సమస్యల పై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వేణు గోపాల్ మేనేజర్ రోహిత్ ,కాలనీ అధ్యక్షులు వాసు చారి, సెక్రటరీ మధు ముదిరాజ్ స్థానిక నాయకులు భానూరి రాకేష్, రిజ్వాన్, నరేష్, శ్రీకాంత్ గౌడ్, భీష్మాచారి, యాదయ్య మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మాతాశిశు సంరక్షణకు అంకిత భావంతో కృషి చేయాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, విశాలభారతి:** మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రసవాల సందర్భంగా మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తూ, నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతా శిశు మరణాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఆసుపత్రిలో సంఘటన చోటుచేసుకుంది, మరణం సంభవించడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ, వైద్య సేవలలో ఏమైనా లోపం జరిగిందా అని ఆరా తీస్తూ, రికార్డులను పరిశీలించారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సంఘటన జరిగినా లోతుగా పరిశీలన జరుపుతామని, నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించినట్టు వెల్లడి అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరుపుతూ, అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. వారు పుట్టింటికి వెళ్ళిన పక్షంలో వారి హెల్త్ రికార్డును అక్కడి అధికారులకు పంపాలని, క్షేత్రస్థాయిలో ఆశాలు, అంగన్వాడీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, వారి ఇళ్ళను సందర్శించి ఆరోగ్య స్థితిని వాకబు చేయాలని అన్నారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో తప్పనిసరిగా తగిన పరిజ్ఞానం కలిగిన నిపుణులైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, వైద్య పరీక్షలు, చికిత్సలు అందించే విషయంలో ఎలాంటి లోపం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రక్త హీనత, బీ.పీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని, అవసరమైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తూ, ఎంతో విలువైన నిండు ప్రాణాలు కాపాడాలని సూచించారు. కాన్పు సందర్భంగా అనుకోని పరిస్థితుల్లో తల్లి మరణిస్తే, బాధిత కుటుంబం చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ,టి.వినయ్ డీ.సీ. హెచ్.ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, కమిటీ సభ్యుడు బుస్స ఆంజనేయులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత వైద్యాధికారులు, వైద్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ యార్డుకు మెరుగైన పరిశుభ్రత

- **రైతులు, వ్యాపారుల ఫిర్యాదుపై వెంటనే స్పందించిన**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**



**విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్ :** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ యార్డును పూర్తి స్థాయిలో శుభ్రపరిచినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు. మార్కెట్‌లో చెత్త పేరుకుపోయిందని రైతులు, వ్యాపారులు సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాలకవర్గ సభ్యులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారి పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి మార్కెట్ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా చైర్మన్ చిలుక మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు మరియు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మార్కెట్ యార్డును ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రైతులు, వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మార్కెట్ కమిటీ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

## మదీనాగూడ పాఠశాలకు కొత్త భవనం

- **నాలుగు కోట్లతో శంకుస్థాపన**



**పాఠశాల భవనానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి రవికుమార్ యాదవ్**

**సైబరాబాద్ విశాల భారతి;** మదీనాగూడ గ్రామ మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల కొత్త భవన నిర్మాణానికి విర్తుసా సంస్థ సామాజిక బాధ్యత నిధులతో నాలుగు కోట్ల రూపాయలు కేటాయించింది. నేటి శంకుస్థాపనలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.పన్నెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పని నేడు సాధ్యమైందని రవికుమార్ యాదవ్ అన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరిన్ని సంస్థలు ముందుకు రావాలని కోరారు. పదవ తరగతి వరకు తరగతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

## మియాపూర్ స్ట్రీట్ వెండర్స్ సమస్యకు పరిష్కారం



**సైబరాబాద్ విశాల భారతి ;** న్యూ కాలనీ శివాలయం ఎదురు గ్రౌండ్‌లో 20 ఏళ్లుగా ప్రతి మంగళవారం వ్యాపారం చేస్తున్న స్ట్రీట్ వెండర్‌స్‌ను సీఆర్పీఎఫ్, పోలీసులు అడ్డుకోవడంతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ స్పందించారు.మార్కెట్ ప్రాంతానికి చేరుకుని సీఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి పేద వెండర్స్ అదే ప్రాంతంలో వ్యాపారం చేసుకునేలా అనుమతులు ఇప్పించారు. పేదల జీవనోపాధిని అడ్డుకోవడం సరికాదని నేతలు అధికారులకు సూచించారు. పరిష్కారంతో వెండర్స్ హర్షం వ్యక్తం చేసి నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

## శేరిలింగంపల్లిలో వర్షా కాల చర్యలపై పీఏసీ చైర్మన్ గాంధీ సమీక్ష

**సైబరాబాద్ విశాల భారతి ;** మల్కం చెరువు, దుర్గం చెరువు, గురునాథం చెరువు, గంగారాం చెరువు ఇన్‌లెట్ , ఔట్‌లెట్లతో పాటు బయోడైవర్సిటీ జంక్షన్, కొత్తగూడ తదితర వాటర్ లాగింగ్ పాయింట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. రాష్ట్ర సలహాదారు సుదర్శన్ రెడ్డి, డీజీపీ సివి ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహా పలువురు ఉన్నతాధికారులు వెంట ఉన్నారు.వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని గాంధీ అధికారులను ఆదేశించారు. ఇన్‌లెట్లు కుంచించుకుపోవడం, చెత్త పేరుకోవడం వల్ల డ్రైనేజీ సమస్య తీవ్రమవుతోందని, వాటర్ లాగింగ్‌కు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మ్యాన్‌హోల్స్ మరమ్మతు, నాల ప్రక్షాళన, అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టాలని సూచించారు. కాలనీల ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని, శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిద్దుతామని హామీ ఇచ్చారు.



**మల్కం చెరువును పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ**

## మొయినాబాద్‌లో మార్కెట్‌కు 39 ఎకరాల ప్రభుత్వ భూమి



- **వినియోగదారులకు మేలు చేసే దిశగా కీలక అడుగు**
- **తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలంలో పండ్లు, కూరగాయలు, పూల మార్కెట్ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. మార్కెట్ నిర్మాణం కోసం సుమారు 39.07 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెటింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు మొయినాబాద్ తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మార్గదర్శకాల ప్రకారం భూమి కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు ఆయన వివరించారు. హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో, అజీజ్‌నగర్ సర్వే నంబర్ 176లో ఉన్న మొత్తం 39.07 ఎకరాల ప్రభుత్వ భూమిని రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ రియాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి. ప్రసాద్‌రావుకు అధికారికంగా అప్పగించారు .ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, నూతన మార్కెట్ ఏర్పాటు ద్వారా పశ్చిమ రంగారెడ్డి జిల్లా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ లభించడంతో పాటు హైదరాబాద్ నగర ప్రజలకు తాజా పండ్లు, కూరగాయలు, పూలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. మార్కెట్ ఏర్పాటుపై ప్రజల ఆకాంక్షలను వెలుగులోకి తీసుకువచ్చిన మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటింగ్ శాఖ కోరిన 60 ఎకరాల భూమిలో భాగంగా త్వరలో మరో 20.33 ఎకరాల భూమిని కూడా కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేశం, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, అజీజ్‌నగర్ జీపీఓ నర్సింహా, హిమాయత్‌నగర్ జీపీఓ హరిత, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏకో టౌన్ డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి



- **జీవో నెం.20 ఉపసంహరించాలి**
- **రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పించిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) ప్రతిపాదనను నిలిపివేయడంతో పాటు జీవో నెంబర్-20ను రద్దు చేయాలని కోరుతూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని చినరావిర్యాల గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు.డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో పరిసర గ్రామాల ప్రజలకు పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, గ్రామాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని మంత్రికి వివరించారు. అదే విధంగా రైతులు, భూ యజమానులకు నష్టం కలిగించే జీవో నెంబర్-20ను కూడా ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమస్యలపై సానుకూలంగా స్పందించి సంబంధిత అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఏకో టౌన్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవడంతో పాటు జీవో నెం.20ను రద్దు చేసి ప్రజల ఆందోళనలకు ప్రభుత్వం ముగింపు పలకాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిన్న రావిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి-దానయ్య, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టముని గీత-మహేష్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్, పిల్లాయిపల్లి ఉప సర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, బండరావిరాల మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దంతూరి మహేందర్ గౌడ్, కొత్త అరుణ్ కుమార్, నెమురుగోముల మహేష్, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం ధర్మారెడ్డి, ములుగు అర్జున్, పల్లపు సురేష్, ఓరిగంటి శివ, గడ్డం ప్రవీణ్ గౌడ్, నారెడ్డి సతీష్‌రెడ్డి, గండికోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సొసైటీకి యూరియా నిల్వల కేటాయింపులు

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**



**నిజామాబాద్, విశాలభారతి:** జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయని అన్నారు. అన్ని సొసైటీలకు ఎరువులను చేరవేస్తూ, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు యూరియా బస్తాలను కేటాయిస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో లక్షా 39 వేల మంది రైతులకు బుకింగ్ యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 3.78 లక్షల బస్తాల యూరియా ఎరువు పంపిణీ జరిగిందని వెల్లడించారు. ఒక్కో ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామని అన్నారు. 3 ఎకరాల వరకు విస్తీర్ణం కలిగిన రైతులకు రెండు విడతలలో యూరియా కేటాయించబడుతోందని, ఐదు ఎకరాల వరకు 40:30:30 నిష్పత్తిలో మూడు విడతల్లో, ఐదు ఎకరాలు పైబడి విస్తీర్ణం కలిగిన వారికి 40:20:20:20 నిష్పత్తిలో నాలుగు విడతలలో యూరియా విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఆన్లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న 24 గంటల లోపు సంబంధిత సొసైటీ లేదా డీలర్ షాప్ నుండి యూరియా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. యూరియా ఎరువుల విషయమై రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, జిల్లాలో ఇప్పటికే ఇంకనూ 28వేల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని కలెక్టర్ భరోసా కల్పించారు. కాగా, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలకం కానుందని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**సర్పంచ్ సంపూర్ణ రాములు**



**మొయినాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంపూర్ణ రాములు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నక్కలపల్లి గ్రామంలో ఘనంగా అక్షరాభ్యాసం



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మంగళరం యాదయ్య, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగళరం యాదయ్య మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే చిన్నప్పటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించాలని అన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామంలో విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## పొన్నం తరుణ్ గౌడ్‌ను పరామర్శించిన జక్కిడి శివచరణ్ రెడ్డి

- **యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేతకు ధైర్యం చెప్పిన నాయకులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రమాదవశాత్తూ కాలికి గాయమై సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్ గౌడ్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పరామర్శించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి ఆసుపత్రికి వెళ్లిన జక్కిడి శివచరణ్ రెడ్డి, పొన్నం తరుణ్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు పొన్నం తరుణ్ గౌడ్‌కు ధైర్యం చెబుతూ, పూర్తి విశ్రాంతి తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానుల ఆశీస్సులతో ఆయన త్వరలోనే కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.పొన్నం తరుణ్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు.

## లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత

- **అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి అండగా నిలిచిన యువనేత జక్కిడి సత్య తేజ రెడ్డి**



**విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్ :** మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన అనిల్ కుమార్ జైస్వాల్ అనారోగ్య సమస్యలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరైన ఎల్ఓసీని మంగళవారం ఉదయం మన్సూరాబాద్‌లో యువనేత జక్కిడి సత్య తేజ రెడ్డి లబ్ధిదారుడు అనిల్ కుమార్ జైస్వాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సత్య తేజ రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుడు అనిల్ కుమార్ జైస్వాల్ తన వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు మరియు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు మున్నా, జానీ, విఠల్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## స్తీలలో సమస్యలపై తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటన



**రాజేంద్రనగర్, విశాలభారతి:** డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ మరియు టాటా నగర్ ప్రాంతాలలో స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలలో ఉన్న సమస్యలను పరిశీలించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి గారు స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్లు, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ పనులు, త్రీఫేజ్ ఎలక్ట్రిక్ లైన్ సమస్యలు వంటి అంశాలపై బస్తీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో కూడా చర్చించారు. డ్రైనేజీ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, నూతన సీసీ రోడ్ల నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా మాన్యువల్ కవర్లు, దెబ్బతిన్న పైప్‌లైన్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, సీనియర్ నాయకులు సంతు గౌడ్, దయానంద్, సాయిలు, నరేష్, శారదా, విశ్వనాథ్, ఏ రమేష్, కాళిదాస్, నికిత, సతీష్, కొండప్ప, అర్జున్, రమేష్ యాదవ్, మల్లికార్జున్, శివరాజ్ , వీరశెట్టి, రాజ్ కుమార్, కిరణ్, ప్రశాంత్, కేశవ్ తదితరులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మనసు



**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి టాపర్‌గా నిలిచి 582 మార్కులు సాధించిన భవిత అనే విద్యార్థిని, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఫీజు బకాయిలు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందలేకపోయింది. దీనికి తోడు పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 634వ ర్యాంక్ సాధించిన ఆమెకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఆ రోజే ఆఖరి తేదీ కావడంతో, తన దీనస్థితిని వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఒక వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తక్షణమే స్పందించి తన కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో స్వయంగా ఫోన్లో మాట్లాడి, విద్యార్థిని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం పది గంటల లోపు మంత్రి నివాసానికి రావాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు తీసుకురాగా, అక్కడికి చేరుకున్న భవితను మంత్రి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని మాట్లాడారు. తల్లిదండ్రులు వ్యాపారంలో నష్టపోయి ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నారని, భవిష్యత్తులో డిప్లొమా పూర్తి చేసి ఇంజనీరింగ్ చదవాలనేదే తన లక్ష్యమని ఆమె వివరించింది. ఇంతటి ప్రతిభావంతురాలైన అమ్మాయికి సహకరించనందుకు పాఠశాల యాజమాన్యాన్ని సున్నితంగా మందలించిన మంత్రి, అక్కడికక్కడే బకాయి ఉన్న 60 వేల రూపాయల ఫీజును చెల్లించి సర్టిఫికెట్లను భవితకు అందజేశారు. పాలిసెట్ వెరిఫికేషన్ స్లాట్ బుకింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించడంతో పాటు, తక్షణ ఖర్చుల కోసం మరో 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ల్యాప్‌టాప్ కావాలన్నా, ఉన్నత చదువులకు ఎలాంటి అవసరమున్నా తానే అండగా ఉంటానని భరోసా ఇవ్వగా, విపత్కర సమయంలో దేవుడిలా ఆదుకున్న మంత్రికి విద్యార్థిని, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

## 24న ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం



**విశాలభారతి:** ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కనగల్ మండలం ధర్వేశిపురంలో జరగనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఈ నెల 24న నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి ఆహ్వాన పత్రం అందజేయగా, మంత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కే.భాస్కర్, కార్యనిర్వాహణ అధికారి అంబటి నాగిరెడ్డి, ఆలయ అర్చకులు, ధర్మకర్తలు మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

- **నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ కీసరి పద్మా సంజీవరెడ్డి**
- **నాగిరెడ్డిగూడ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం**



**మొయినాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యా బోధన నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ కీసరి పద్మా సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కీసరి పద్మా సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యా బోధన నిర్వహించడం జరుగుతుందని అన్నారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర జైపాల్, వార్డు సభ్యులు హేమలత అర్జున్, వనజా కుమార్, యాదగిరి, రాజు, నిరోషా వికాస్, విజయ్ రాజ్, మధుకర్, రోజా మహేందర్, శశిధర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టుతో స్థానిక రైతాంగానికి సాగునీటి వెలుగులు

- **సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం**
- **అశ్వాపురం మారేళ్ళపాడు, బూర్గంపహాడ్ దోమలవాగు మినీ రిజర్వాయర్ పనుల పురోగతిపై సమీక్ష**
- **ప్రాజెక్టు అనుసంధానంగా కాలువ గండి ద్వారా దోమలవాగుకు నీరు మళ్లింపు**
- **మారేళ్ళపాడు, దోమలవాగు నిర్మాణాలతో సుమారు 33 వేల ఎకరాలకు సాగునీరు**



విశాలభారతి, మణుగూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్ట్ కాలువకు అనుసంధానమైన అశ్వాపురం మండలంలోని మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను అలాగే బూర్గంపహాడ్ దోమలవాగు మినీ రిజర్వాయర్ పనులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంబంధిత ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులు, మరియు పలువురు సర్పంచులతో కలిసి మంగళ వారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జరుగుతున్న ప్రాజెక్టు పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, నిర్దేశిత లక్ష్యాలపై అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకే తలమానికంగా నిలుస్తున్న సీతారామ ప్రాజెక్ట్ కాలువ యావత్ పినపాక నియోజకవర్గ వ్యవసాయరంగానికే ఓ జీవనాడిగా నిలుస్తుందని అన్నారు. అటు అశ్వాపురం మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుడి, ఎడమ కాలువల నిర్మాణాల ద్వారా సుమారు 17 వేల ఎకరాలకు నీరు అందించేందుకు కృషిచేస్తున్నామని, అలాగే ఇటు బూర్గంపహాడ్ దోమలవాగు మినీ రిజర్వాయర్ ద్వారా సుమారు 16 వేల ఎకరాలకు నీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకుగానూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు జిల్లా పెద్దలు, మంత్రుల సహకారంతో సమస్త రైతాంగానికి జీవనాడిగా నెలకొన్న సీతారామ ప్రాజెక్టు ద్వారా అటు ప్రజలకు, ఇటు రైతులకు సాగు నీరు, త్రాగు నీరు అందించే అంశాలను అలాగే ప్రాజెక్టు నిర్మాణము, స్టోరేజ్ నిల్వల సామర్థ్యం వలన భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత నెలకొన్న పరిశ్రమలతో పాటుగా మరిన్ని నూతన ఉత్పాదక పరిశ్రమల ఏర్పాటుకు మార్గాలు సుగుమం అవుతాయని, తద్వారా ఉమ్మడి జిల్లాతో పాటుగా నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, రైతులు, ప్రాజెక్టు'పై ఆధారపడే వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దోహద పడుతుందని మీడియా అభి ముఖంగా కొనియాడారు.

## న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలి

- **ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాచలం యూనిట్ డిమాండ్**



**భద్రాచలం ,విశాలభారతి;** బార్ కౌన్సిల్లో నమోదైన న్యాయ వాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు టి. చైతన్య డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ, తెలంగాణ రాష్ట్ర కమిటీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులతో కలిసి ప్రదర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా భద్రాచలం యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బండారు అరుణ్ చంద్, పాయం రవివర్మ, జిల్లా కమిటీ సభ్యులు యు గౌతమ్ కుమార్, సీనియర్ న్యాయవాది యం కిషోర్, న్యాయవాదులు ఎ అంజిలి కుమారి, శివకృష్ణ, కోరాడ శ్రీనివాస రావు, విజ్జగిరి రవితేజ, సౌజన్య, పి మధుబాబు, లక్ష్మణ్ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మినీ జలాశయంగా దోమలవాగు చెరువు

- **యూటీ నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం భూమి పూజ**
- **జలాశయం నిర్మాణంతో సాగు,త్రాగునీటి కష్టాలు మాయం**
- **జలాశయ నిర్మాణానికి పోతిరెడ్డి మాజీ ఉపసర్పంచ్ పాత్ర కీలకం**



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు నకిరేపేట దోమలవాగు చెరువు మినీ జలాశయంగా రూపుదిద్దుకుంటుంది. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నుండి గోదావరి జలాలను దోమల వాగు చెరువుకు మళ్లించి మినీ జలాశయంగా మార్చనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండల ప్రజలకు,రైతులకు తీపి కబురు అందించి యూటీ నిర్మాణానికి భూమి పూజ చేసి మినీ జలాశయం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జలాశయం ఏర్పాటుతో బూర్గంపాడు,లక్ష్మీపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు 16 వేల ఎకరాల భూమిసాగులోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిశ్రమ ప్రాంతమైన లక్ష్మీపురంలో నీటి ఊటలు పెరిగి బోర్లు, బావుల్లో పుష్కలంగా నీటి నిల్వలు లభిస్తాయని అన్నారు. నకిరేపేట మినీ జలాశయం పూర్తయితే పర్యాటక ప్రాంతంగా ఏర్పడి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అన్నారు. ఈ జలాశయం నిర్మాణానికి లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి కీలక పాత్ర పోషించారని వ్యాఖ్యానించారు. భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన 200 మంది కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు భోజన ఏర్పాట్లు చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ,పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

## బుక్స్ స్టేషనరీ పంపిణీ



**ముషీరాబాద్, విశాల భారతి:** సమాజం లోని బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా తమ సంస్థ కృషి చేస్తుందని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్టు, స్మారక సంస్థ చైర్పర్సన్ శ్యామలరావు తెలిపారు. విద్యాసంస్థలు పున ప్రారంభమైన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ విద్యానగర్ లోని పలు పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలను దాతలతో కలిసి పంపిణీ చేశారు. సామాజిక కోణంలో విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సంవత్సరం దాతల సహకారంతో నోటు పుస్తకాలను పంపిణీ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు.

## రక్తం మోడు తున్న ప్రధాన రహదారి

- **ధ్వంసమైన ప్రధాన రహదారి డ్రైవింగ్కు సవాల్**
- **ఇసుక లారీల వలన డేంజర్ జోన్లో ప్రధాన రహదారి**
- **వాటాలతో వాడి వేడిగా కట్టల పంపకాలు**
- **ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు**
- **రోడ్డుపైన రక్తసిక్తమై ప్రాణాలు కోల్పోయిన వాహనదారులు**
- **భయానకంలో కొనసాగుతున్న ప్రయాణం**
- **భద్రాచలం నుండి పర్ణశాలకు వెళ్లే భక్తులకు ప్రాణ సంకటంగా మారిన రహదారి**
- **ఇదిలాగే కొనసాగితే మరి ఎన్ని ప్రాణాలు కోల్పోతాయో**

**భద్రాచలం, విశాలభారతి:**



భద్రాచలం నుండి రాములవారిని దర్శించుకున్న భక్తులు ప్రయాణికులు తిరిగి పర్ణశాలకు వెళ్లేందుకు ఆటోల పైన బస్సుల పైన తమ వెంట తెచ్చుకున్న వాహనాల పైన వెళ్తున్నారు. ప్రయాణం సురక్షితంగా ఉండాలి కానీ భద్రాచలం నుండి పర్ణశాల వెళ్లే రహదారి ఇసుక లారీల వలన విధ్వంసానికి గురయ్యాయి పెద్దపెద్ద గుంటలతో నిండి వాహనాలు నడిపేందుకు ప్రాణ సంఘటనగా మారిన సంఘటనలు ఉన్నాయి. లారీలు నిర్లక్ష్యానికి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. అయినా సరే నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి వాటాల పంపకాల కాడ పెనుగులాడుతున్న అధికారులు ఇటు ప్రజా ప్రతినిధులు డబ్బుల మీద ఉన్న ప్రేమ ప్రజల ప్రాణాల పైన లేకపోవటం ఒక ఇంత బాధను గురిచేస్తుంది. ఈ ప్రాంతం అంటే సురక్షిత ప్రాంతం అనే నానుడి ఉంది. ఇక్కడ చెట్లు అడవులతో ఈ ప్రాంతం వస్తున్న పర్యటకులకు ఆహ్లాదకరన్ని పంచుతుంది. కానీ నేడు అందుకు భిన్నంగా ఉండటం ప్రయాణికులకు స్థానిక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. బయటికి వచ్చిన వ్యక్తి మరలా తిరిగి ఇంటికి వస్తాడో లేదో అని భయంతో ఎదురుచూస్తున్న కళ్ళు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతంలో జరుగుతున్న సహజ వనరులైన ఇసుక ,మట్టి గ్రావెల్స్ వంటి అటవీ సంపదను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తరలించే క్రమంలో సక్రమంగా ఉన్న రోడ్లు గుంతలుగా ఏర్పడడం వలన ప్రయాణానికి ఆటంకంగా మారింది. డబ్బుల వాటాల కాడ చూపిస్తున్న వాత్సల్యం ధ్వంసమైన రోడ్లపైన చూపెట్టకపోవడం పట్ల ఈ అధికారులకు, ప్రజాప్రతినిధులకు బాధ్యత ఏ మేరకు ఉందో అనేది తేటతెల్లమవుతుంది. ఇసుక లారీల వలన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ధ్వంసమైన ప్రధాన రహదారి మరమ్మత్తులు చేయడంలో ఎవరూ ముందుకు రాకపోవడం పట్ల ఈ ప్రాంతం ప్రజల ప్రాణాలపై ఎంతటి ప్రేమ ఉందో అర్థం అవుతుంది. మైకులు పట్టుకొని ఈ ప్రాంతం అభివృద్ధికి పాటుపడతామని చెప్పే నేతలు ఈ ప్రాంత ప్రజలకు గుండె కోతలు మిగులుస్తున్నారు. అనేకమంది ఇసుక లారీలు చేసిన రోడ్ల ధ్వంసం కి అనేకమంది కాళ్లు ఇరుగుటం చేతు లెరగటం ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణమైంది. ఇటువంటి ప్రమాదకరమైన సంఘటనలను పరికరంలోకి తీసుకోకుండా వ్యవహరించటం, దేనికి నిదర్శనమో వారికే వదిలేయాలి. ఇప్పటికైనా జరుగుతున్న ప్రమాదాలను కట్టడి చేయాలి . ధ్వంసమైన ప్రధాన రహదారిని మరమ్మత్తులు చేసి ఈ ప్రాంత ప్రజల ప్రయాణాన్ని సురక్షితంగా ఉండేటట్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి ఈ ప్రాంతానికి దైవ దర్శనానికి వస్తున్న అనేకమంది భక్తులకు భరోసా కల్పించే విధంగా రవాణా సౌకర్యాన్ని సురక్షితం చేయాలి. పాడైపోయి ప్రాణానికి హాని కలిగించే ప్రధాన రహదారిని బాగు చేసి ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు భరోసా కల్పించాలి. భద్రాచలం అంటే అడవులతో ప్రయాణానికి ఆహ్లాదకరానికి సౌకర్యవంతంగా ఉంటుందనే విధంగా ఇక్కడున్న అధికారులు ,ప్రజాప్రతినిధులు ఉన్నత అధికారులు దృష్టి సారించి ప్రజా ఆకాంక్షను నెరవేర్చాలని ఆశిస్తున్నాం

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సైబరాబాద్ విశాల భారతి ;** విద్యుత్ సరఫరా లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల నిమిత్తం రేపు బుధవారం చందానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా అధికారులు కోత విధించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కిలోవాట్ హుడా కాలనీ ఫీడర్ నుంచి సరఫరా అయ్యే హుడా కాలనీ, చందానగర్ ప్రాంతాల్లో కరెంటు ఉండదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కిలోవాట్ పాపిరెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ ప్రాంత ప్రజలు విద్యుత్ లేకుండా గడపాల్సి వస్తుంది.పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ప్రజలు సహకరించాలని తారానగర్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు తెలిపారు.

## ముందస్తు చర్యలపై సమన్వయ సమావేశం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** నగర పాలక సంస్థ పరిధిలోని నార్సింగ్ సర్కిల్ 45, శేరిలింగంపల్లి జోన్‌లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలపై కీలక సమన్వయ సమావేశం నిర్వహించబడింది. మంగళవారం (16062026) ఉదయం 11:30 గంటలకు డిప్యూటీ కమిషనర్ ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, జల మండలి, హైడ్రా, విద్యుత్ శాఖ (టీజీఎస్పీడీసీఎల్) ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో భాగంగా అన్ని శాఖల మధ్య సమన్వయం పెంపొందించేందుకు అధికారుల మొబైల్ నెంబర్లతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే సర్కిల్ పరిధిలో వరద నీరు నిల్వ అయ్యే ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, లా అండ్ ఆర్డర్ అధికారి హరి కృష్ణా రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ మణికంఠ, హైదరాబాద్ జల మండలి మేనేజర్ యండి మజీద్, హైడ్రా సభ్యులు మరియు నార్సింగ్ సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు.

## ప్రైవేట్ స్కూల్స్ కాలేజ్ , బస్సుల్లో పిల్లల ప్రాణాలతో చెలగాటం



**విశాలభారతి, మణుగూరు :** జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు నిబంధనలను బేఖాతరు చేస్తూ పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడం వల్ల చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని సామాజిక సేవకులు కర్నె బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం భద్రాచలం యూనిట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు , కాలేజ్ బస్సుల్లో కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని ఆరోపించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు వంటి తప్పనిసరి సౌకర్యాలు లేకుండానే బస్సులు రోడ్లపై తిరుగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా కొందరు డ్రైవర్లు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, అనుభవం లేని వ్యక్తులను డ్రైవర్లుగా నియమించడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అధికారులను కోరారు. ఓవర్‌లోడ్‌కు పాల్పడే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అర్హత కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించి, వారికి ఖాకీ యూనిఫాం, చట్టబద్ధమైన వేతనాలు, అవసరమైన శిక్షణ అందించాలని డిమాండ్ చేశారు.

# మునుగోడు ఓటుకు పెరిగిన డిమాండ్





**విశాలభారతి:** మునుగోడులో ఓటు విలువ పెరిగిందని, ఇతర ప్రాంతాలలో ఓటు ఉన్నప్పటికీ ఇక్కడే ఓటు ఉంచుకోవాలనే ఒక ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ అయిందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. సామాన్యుడి చేతిలో ఓటు ఒక వజ్రాయుధమని, అభివృద్ధి జరగాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరిగిన నియోజకవర్గ వ్యాప్త బూత్ లెవెల్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పీసీసీ నియమించిన మాస్టర్ ట్రైనర్ సుమన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నియోజకవర్గంలోని ఓటర్లు, మ్యాపింగ్ మరియు అన్ మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను వివరించారు. అర్హులైన వారి ఓటు తొలగించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారి విషయంలో అనుసరించాల్సిన చర్యలపై బిఎల్ఏలకు ఉన్న పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.




నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐసిసి కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ మాట్లాడుతూ, మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మార్పులు, చేర్పులు మరియు తప్పులు ఉన్న ఓటర్ల సంఖ్య సుమారు 91 వేల వరకు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను బిఎల్ఏలు ఎంతో సీరియస్‌గా తీసుకొని, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్త బిఎల్ఏలతో పాటు మున్సిపాలిటీల చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు మరియు ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ‘కల్కి 2’లో ఆలియా భట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ వండర్ ‘కల్కి 2898 ఏడి’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. పురాణాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌కు ప్రేక్షకులు బ్రహ్మారథం పట్టారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల నటన ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ భారీ బ్లాక్‌బస్టర్ సీక్వెల్ ‘కల్కి-2’ కూడా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.ఈ క్రమంలోనే ‘కల్కి’ ఫ్రాంచైజీ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో మొదటి భాగంలో నటించిన దీపికా పదుకొనె కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆలియా భట్ దీపికా పోషించిన ‘సుమతి’ పాత్రను చేయడం లేదని తెలుస్తుంది. ఈ సినిమాలో వచ్చే ఒక పవర్‌ఫుల్ స్పెషల్ రోల్‌లో ఆమె కనిపించనున్నట్లు సమాచారం. మరింత షాకింగ్ విషయమేమిటంటే.. ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంతమేర షూటింగ్‌ను కూడా సైలెంట్‌గా పూర్తి చేసిందని టాక్. ‘ఆర్ఆర్ఆర్’ చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా.. ఇప్పుడు ఈ క్రేజీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ అలియా ఎంట్రీపై త్వరలోనే వైజయంతీ మూవీస్ టీమ్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.